అనుదినం... జనస్వరం

ఉమ్మడి ఆదిలాబాద్

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

'డాక్టర్స్ డే' ప్రత్యేక సంచిక

8 పేజీలు | శనివారం 01 జులై 2023 | www.navatelangana.com



పల్లె చెంతకే వైద్యం..!

- ప్రజలకు అందుబాటులోకి మెరుగైన సేవలు
- పలు పీహెచ్‌సీల పనితీరుకు జాతీయ అవార్డులు
- కొత్తగా మెడికల్ కళాశాలలతో మరింత ప్రయోజనం
- ఉమ్మడి జిల్లాలో మెరుగుపడిన వైద్య సేవలు

ఇది వరకు పట్టణాలు, మండల కేంద్రాలకే అధికంగా పరిమితమైన వైద్య సేవలు..కొన్నాళ్ల నుంచి పల్లె చెంతకే చేరుతున్నాయి. సర్కారు వైద్య సేవలు మెరుగుపడటంతో సామాన్య జనాల ఆరోగ్యానికి భరోసా లభిస్తోంది. ప్రభుత్వం ఇటీవల సబ్ సెంటర్లను పల్లె దవాఖానాలుగా మార్చడంతో అక్కడ వైద్యులు అందుబాటులోకి వచ్చారు. దీంతో గ్రామీణ ప్రజలు వైద్యసేవల కోసం మండల కేంద్రాల్లోని పీహెచ్‌సీలకు వెళ్లే అవసరం లేకుండా పల్లె దవఖానాలోనే పొందేందుకు వీలు కలిగింది. మరోపక్క జిల్లా కేంద్రాల్లో టీ- డయాగ్నోస్టిక్ కేంద్రాల ఏర్పాటుతో 56రకాల ఆరోగ్య పరీక్షలు ఉచితంగా చేయించుకునే అవకాశం దక్కుతోంది. ఇది వరకు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోనే మెడికల్ కళాశాల ఉండగా.. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పడిన మూడు జిల్లాలోనూ వీటిని మంజూరుచేసింది. పీహెచ్‌సీల్లో వైద్యుల కొరతను తీర్చడంతో పల్లెవాసులకు స్థానికంగానే సేవలు లభిస్తున్నాయి. నేడు జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉమ్మడి జిల్లాలో పేదలకు అందుతున్న వైద్య సేవలపై ప్రత్యేక కథనం..



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో వైద్య సేవలు గతం కంటే మెరుగుపడ్డాయి. వైద్యులు, సిబ్బంది, మౌళిక వసతులు, పరికరాలు లేక అవస్థలు పడిన ఆస్పత్రులకు మంచి రోజులు వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం వైద్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టడం..అందులోనూ పేదలు అధికంగా ఉండే ఉమ్మడి ఆదిలాబాద్‌పై దృష్టిసారించడంతో ఆయా వసతులు సమకూరుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో 72 పీహెచ్‌సీలు ఉండగా సుమారు 436 ఆరోగ్య ఉప కేంద్రాలున్నాయి. ప్రస్తుతం అన్ని పీహెచ్‌సీల్లో వైద్యుల నియామకం చేపట్టిన ప్రభుత్వం.. పల్లె దవఖానాలుగా మారిన ఉప కేంద్రాల్లోనూ వైద్యులు అందుబాటులోకి వచ్చారు. జిల్లాలో భీంపూర్, ఇచ్చోడ,ఇంద్రవెల్లి, బజార్‌హత్నూర్, గుడిహత్నూర్, దంతన్‌పల్లి తదితర పీహెచ్‌సీలు జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా వైద్య సేవలు అందించడంతో నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్కీం(ఎంకాస్) అవార్డుకు ఎంపికయ్యాయి. వీటికి ప్రతి ఏటా రూ.3లక్షలు ప్రోత్సాహక నిధులు అందనున్నాయి. ఈ పథకం కింద పలు ఉప కేంద్రాలు కూడా ఎంపిక కావడం గమనార్హం. ఉట్నూర్ జిల్లా కేంద్రం ఆస్పత్రిలోని ఎన్ఎస్‌సీయూ యూనిట్ జాతీయ అవార్డు దక్కింది. పట్టణాల్లో బస్తీ దవఖానాలు ఏర్పాటుచేసి వైద్య సేవలు అందిస్తున్నారు. సాధారణ ప్రసవాల్లో ఆదిలాబాద్ జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

మెడికల్ కళాశాలలతో ప్రయోజనం

ఇది వరకు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోనే మెడికల్ కళాశాల అందుబాటులో ఉండగా.. ప్రభుత్వం వీటిని మిగితా మూడు జిల్లాలకు కూడా మంజూరుచేసింది. మంచిర్యాల, నిర్మల్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలకు కూడా కొత్తగా మంజూరుకావడంతో రానున్న రోజుల్లో ఇక్కడా రిమ్స్ తరహాలో మెరుగైన వైద్య సేవలు లభించేందుకు ఆస్కారం ఉంటుంది. ఆయా జిల్లా కేంద్రాల్లో ఈ ఏడాది నుంచి ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభం కానున్నాయి. దీంతో జిల్లావాసులతో పాటు వివిధ ప్రాంతాల విద్యార్థులకు ఇందులో సీట్లు లభించేందుకు అవకాశం దక్కింది. మెడికల్ కళాశాలలు రావడంతో స్థానికులు ఇతర ప్రాంతాలకు వెళ్లే అవకాశం లేకుండా ఇక్కడే వైద్యం లభిస్తుంది.

ఇంటింటి సర్వేతో జ్వరాలు అదుపు

ఉమ్మడి జిల్లాలో వాతావరణ మార్పులు, పరిసరాల అపరిశుభ్రత తదితర కారణాలతో ప్రతి ఏటా

మిగతా..8లో...

ఎపిడమిక్ బృందాన్ని సిద్ధం చేశాం



- అన్ని రకాల మందులు సిద్ధంగా ఉన్నాయి
- మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు
- రిమ్స్ డైరెక్టర్ డా.జైసింగ్ రాథోడ్

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

వర్షాకాలంలో ఫుడ్ పాయిజన్ ఘటనలు జరిగి ఆస్పత్రికి వచ్చే వారికి సత్వర చికిత్స అందించేందుకు ప్రత్యేకంగా వైద్యులు, సిబ్బందితో కూడిన ప్రత్యేక ఎపిడమిక్ బృందాన్ని నియమించినట్లు రిమ్స్ డైరెక్టర్ డా.జైసింగ్ రాథోడ్ అన్నారు. సీజనల్ వ్యాధులతో బాధపడుతూ రిమ్స్‌కు వచ్చే వారికి మెరుగైన వైద్యం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఇప్పటికే వైద్యులు, జనరల్ మెడిసిన్, నర్సింగ్, ల్యాబ్ టెక్నీషియన్ తదితర డిపార్ట్‌మెంట్లన్నింటితో సమావేశం నిర్వహించి అప్రమత్తం చేశామని వెల్లడించారు. సీజనల్ వ్యాధులతో బాధపడుతూ రిమ్స్‌కు వచ్చే రోగులకు అందించే వైద్యం, సిబ్బంది అప్రమత్తతపై రిమ్స్ డైరెక్టర్ నవతెలంగాణతో మాట్లాడారు.

అన్ని రకాల మందులు ఉన్నాయి

ప్రతి ఏటా సీజనల్ వ్యాధులకు గురై అనేక మంది రోగులు రిమ్స్‌కు వైద్యం కోసం వస్తుంటారు. అలాంటి వారికి మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రత్యేక దృష్టిసారించాం. ఇప్పటికే సంబంధిత డిపార్ట్‌మెంట్లతో సమావేశం నిర్వహించి అప్రమత్తం చేశాం. రిమ్స్ డ్రగ్ స్టోర్‌లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. వైద్యులు కూడా ఇటీవల 31మంది కొత్తగా వచ్చారు. వీరితో పాటు సీనియర్ రెసిడెంట్లు, ఇది వరకే ఉన్న వైద్యులు సేవలందిస్తున్నారు. ముఖ్యంగా సీజనల్లో డెంగ్యూ తదితర వ్యాధులు ప్రబలితే వారికి చికిత్స అందించేందుకు ప్రత్యేక గదులు సిద్ధం చేశాం. వైద్యం కోసం రిమ్స్‌కు వచ్చిన రోగులకు భరోసానివ్వడమే కాకుండా అన్ని రకాల సదుపాయాలు కల్పించేందుకు కృషిచేస్తున్నాం. చికిత్స అందించేటప్పుడు వైద్యులు, సిబ్బంది ఎల్లప్పుడు అందుబాటులో ఉండేలా కార్యాచరణ సిద్ధం చేశాం.

సూపర్‌లో రెగ్యూలర్ వైద్యుల కోసం

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో కాంట్రాక్టు ప్రతిపాధికన కాకుండా రెగ్యూలర్ పోస్టుల్లో వైద్యులను నియమించే ఏర్పాట్లు జరుగుతున్నాయి. దీనికి సంబంధించిన దస్త్రం సచివాలయంలో ఉంది. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే రెగ్యూలర్ వైద్యులను నియమించి సూపర్ సేవలను అందించేందుకు చర్యలు తీసుకుంటాం. త్వరలోనే ఈ ప్రక్రియ పూర్తయ్యేందుకు ఆస్కారం ఉంది. మరోపక్క వైద్య విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నాం. బోధనకు సంబంధించి అధ్యాపకులు అవసరం మేరకు ఉన్నారు. కేవలం 4 పోస్టులు మాత్రమే ఖాళీగా ఉన్నాయి. గతేడాది కొందరు విద్యార్థులు ఫుడ్ పాయిజన్ భారినపడిన ఘటనలు ఉన్నాయి. ఈ ఏడాది అలాంటి సంఘటనలు జరగకుండా ముందస్తుగా నివారణ చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉన్నాం



- సత్వర చికిత్స కోసం ర్యాపిడ్ ఫోర్స్ బృందం
- నేటి నుంచి ఏజెన్సీలో ఫీవర్ సర్వే
- జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డా.నరేందర్ రాథోడ్

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధుల పట్ల వైద్యఆరోగ్య యంత్రాంగం అప్రమత్తంగా ఉందని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డా.నరేందర్ రాథోడ్ అన్నారు. ఇందుకోసం కొత్తగా 25మంది వైద్యులతో ర్యాపిడ్ ఫోర్స్ బృందాన్ని ఏర్పాటుచేసినట్లు వెల్లడించారు. వీరికి శిక్షణ సైతం అందించామని పేర్కొన్నారు. ఈ ఏడాదిలో సీజనల్ వ్యాధులను ముందస్తుగానే నివారించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు వివరించారు. ఇప్పటికే పరిసరాల పరిశుభ్రత, మురికికాల్వలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం వంటి చర్యలపై పంచాయతీశాఖ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించామని చెప్పారు. జిల్లాలా ఏటా ప్రబలే సీజనల్ వ్యాధుల నివారణ కోసం అధికార యంత్రాంగం తీసుకుంటున్న చర్యలపై డీఎంహెచ్ఓ నవతెలంగాణకు వివరించారు. ఆ వివరాలు ఇవి..

ముందస్తు నివారణ చర్యలు

గతేడాది ప్రబలిన సీజనల్ వ్యాధుల కారణంగా అనేక మంది వివిధ రకాల వ్యాధులతో బాధపడ్డారు. ఆ సమయంలోనూ ఇంటింటి సర్వే నిర్వహించి అవసరమైన వారికి మందులు అందించి నివారించగలిగాం. గతేడాది అనుభవంతో ఈ ఏడాది ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని నిర్ణయించాం. 25మంది వైద్యులతో కూడిన ర్యాపిడ్ ఫోర్స్ బృందం అత్యవసర సమయాల్లో వైద్యం అందించేందుకు సిద్ధంగా ఉంచాం. ప్రతి వారం డ్రైడే నిర్వహిస్తున్నాం. దీనిపై గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటున్నాం. అన్ని పీహెచ్‌సీలు, పల్లె దవఖానాల్లో అవసరం మేరకు వైద్యులు ఉన్నారు. పల్లె దవఖానాల్లో 14 రకాల టెస్టులతో పాటు 85 రకాల ట్యాబెట్లు అందుబాటులో ఉంచాం. గ్రామీణ ప్రాంతాల్లో ఓఆర్ఎస్ పొట్లాలు, వాంతులు, విరేచనాలకు సంబంధించిన మందులను అందుబాటులో ఉంచుతున్నాం.

జూలైలో ర్యాపిడ్ ఫీవర్ సర్వే

ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో జూలై 1వ తేదీ నుంచి ర్యాపిడ్ ఫీవర్ సర్వే చేపడుతున్నాం. ఎక్కడైనా జ్వరాలు ప్రబలిన వెంటనే సత్వర వైద్యం అందిస్తూ నివారించేందుకు కార్యాచరణ రూపొందించాం. అవసరమైన అన్ని రకాల మందులు, వైద్యులు అందుబాటులో ఉన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో రోడ్లు బాగాలేని ప్రాంతాలు, వాగులపై కల్వర్టులేకుండా అవతల ఉన్న గ్రామాల వివరాలను తీసుకున్నాం. ఆయా గ్రామాల్లో ఉన్న గర్భిణీల వివరాలను నమోదు చేసుకున్నాం. ప్రసవం కోసం వారు ముందస్తుగానే పీహెచ్‌సీలకు వచ్చేలా ఏర్పాట్లు చేశాం. వీరికి కోసం వివిధ పీహెచ్‌సీల్లో ప్రత్యేక గదులు ఏర్పాటుచేశాం. ఈ విషయమై ఇది వరకే ఆయా గ్రామాల్లో గర్భిణీలకు సమాచారం అందించాం. మరోపక్క గ్రామాల్లో ఆర్ఎంపీలను ఇది వరకే హెచ్చరించాం. కేవలం ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాలి. ఎవరైన జ్వరంతో బాధపడుతున్నా.. వివిధ లక్షణాలు కలిగిన వారు ఉంటే వెంటనే పీహెచ్‌సీలకు సమాచారం అందించాలని సూచించాం. జిల్లాలో ముందస్తు జ్వరాల నియంత్రణకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు డీఎంహెచ్ఓ తెలిపారు.

మెరుగైన వైద్యం..పేదలకు ఉపశమనం..!

- నిరుపేదలకు వరంలా మారిన రిమ్స్ ఆస్పత్రి
- అందుబాటులోకి వచ్చిన వైద్యులు, సిబ్బంది
- త్వరలోనే ఎంఆర్ఐ యంత్రం..వ్యాధి నిర్ధారణ సులభం



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రి పేదలకు వరంలా మారుతోంది. ప్రయివేటులో రూ.వేలల్లో డబ్బులు ఖర్చు చేయలేని అనేక మంది పేదలు రిమ్స్‌లో ఉచితంగా మెరుగైన వైద్య సేవలు పొందుతున్నారు. తొలుత వైద్యులు,సిబ్బంది లేమితో అవస్థలు పడిన ఈ ఆస్పత్రిలో ప్రభుత్వం వివిధ సౌకర్యాలను కల్పించింది. కొత్తగా వైద్యుల నియామకంతో పాటు వివిధ వ్యాధి నిర్ధారణ యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో మెరుగైన వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లడం చాలా వరకు తగ్గిందని అధికారులు చెబుతున్నారు. 500పడకల సామర్థ్యం కలిగిన ఈ ఆస్పత్రిలో అన్ని రకాల వ్యాధులకు చికిత్సలు అందిస్తున్నారు. ఇటీవల మోకాళి చిప్ప మార్పిడిని విజయవంతంగా నిర్వహించిన వైద్యులు అందరి ప్రశంషలు పొందుతున్నారు. వీటితో పాటు క్లిష్టమైన సర్జరీలను కూడా చేసి బాధితులకు స్వాంతన కలిగించారు.

కొత్తగా 31మంది వైద్యులు రాక



రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన వైద్యుల నియామకంతో రిమ్స్ ఆస్పత్రికి కొత్త వైద్యులు వచ్చారు. 39మందికి గాను 31మంది వైద్యులు విధుల్లో చేరారు. వీరితో పాటు 24మంది సీనియర్ రెసిడెంట్లు, వివిధ విభాగాలకు చెందిన సీనియర్ వైద్యులతో పాటు సుమారు 200మంది జూనియర్ వైద్యులు సేవలందిస్తున్నారు. ఇన్నాండ్లు వైద్యుల లేమితో అవస్థలు పడిన రిమ్స్‌లో కొత్త వైద్యుల రాకతో ప్రజలకు మేలు చేకూరుతోంది. ఇటీవల గర్భిణీల సౌకర్యార్థం టిఫా స్కాన్ అందుబాటులోకి వచ్చింది. ఇప్పటికే ఎస్ఎన్‌సీయూ యూనిట్‌తో పాటు న్యూట్రిషియన్ రిహాబిటేషన్ సెంటర్(ఎన్ఆర్‌సీ) సైతం సేవలందిస్తోంది. త్వరలోనే రూ.11కోట్లతో మంజూరైన ఎంఆర్ఐ యంత్రం అందుబాటులోకి రానుంది. టెండర్ ప్రక్రియ ముగియగానే అందుబాటులో వస్తుందని అధికారులు చెబుతున్నారు. ఈయంత్రం ద్వారా వ్యాధి నిర్ధారణ సులభతరంగా మారుతుంది. వైద్యం కోసం ఆదిలాబాద్ జిల్లానే కాకుండా ఉమ్మడి జిల్లా నుంచి జనాలు ఈ ఆస్పత్రికి వస్తుంటారు. సమీప మహారాష్ట్ర వాసులు కూడా మెరుగైన చికిత్స కోసం రిమ్స్‌కు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. దీనికి తోడు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలోనూ త్వరలో పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని అధికారులు చెబుతున్నారు.

ప్రభుత్వాస్పత్రిలో ఏజెన్సీ ప్రజలకు మెరుగైన వైద్యం

● జాతీయ స్థాయిలో పలు అవార్డులకు ఎంపిక



నవతెలంగాణ-ఉట్నూర్

ఏజెన్సీకి కేంద్ర బిందువు అయిన ఉట్నూర్ కేంద్రంగా ఉన్న ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు లక్ష్యంగా వైద్యులు, సిబ్బంది కృషి చేస్తున్నారు. వైద్య సేవల్లో మెరుగైన ఫలితాలు సాధించడం వల్ల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్ ప్రభుత్వ జిల్లా అస్పత్రికి ముస్కాన్ అవార్డు వరించింది. డాక్టర్స్ డే సందర్భంగా ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రిపై నవతెలంగాణ ప్రత్యేక కథనం....

సీజనల్ వ్యాధులతో ఏజెన్సీ అంతా జ్వరాలతో, ఇతర వ్యాదులతో మంచాన పడి మృత్యుఒడిలోకి వెళుతున్న సంఘటనలు గతంలో ఉన్నాయి. ఇక్కడి ప్రజలకు ప్రభుత్వ వైద్యం అందించేందుకు అప్పటి సీఎం ఎన్టీఆర్ 24.09.1987లో 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రిని ప్రారంభించారు. అప్పుడు కేవలం ఇద్దరు వైద్యులతో ప్రారంభమైన ఆస్పత్రికి నేడు 12 మంది ప్రత్యేక వైద్యులతో 50 పడకల అస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసి, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు. సీజనల్ వ్యాధులతో మాన్యమంతా జ్వరాలు వ్యాపించి మృతి చెందిన సంఘటనలు గతంలో కోకొల్లాలుగా ఉన్నాయి. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ ఆస్పత్రులను బోలోపేతం



చేసేందుకు తగు చర్యలు తీసుకోవడంతో ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రిని మరింత అభివృద్ధి చేశారు. 2019లో ఉట్నూర్ అస్పత్రిని 50 పడకల అస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ, నూతన భవనం మంజూరు చేసి మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, హరీశ్ రావులు ప్రారంభించారు. ఏజెన్సీలో గిరిజనులకు రక్తహీనతతో బాధపడుతున్నారని రక్తహీనత నివారణకు, తగు జాగ్రత్తలు, అవగాహణకై ఎస్ఎన్‌సీయూ ఏర్పాటు చేసి, 6 సంవత్సరాల వయస్సులోని పిల్లందరికి పౌష్టికాహారం అందిస్తున్నారు. అదే విధంగా అప్పుడే పుట్టిన చిన్నారులకు నాణ్యమైన వైద్యం అందించాలని ఎన్ఆర్సీని ప్రారంభించారు. మాతాశిశు మరణాలను నివారణకు వైద్యులు కృషి చేస్తున్నారు. గిరిజనులకు అత్యవసర సమయంలో రక్తం ఎక్కించాల్సి వస్తే ఆదిలాబాద్ రిమ్స్ వెళ్లాలి. రోగులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వ ఆస్పత్రిలో బ్లడ్ బ్యాంకును ఎర్పాటు చేసి అత్యవసర సమయంలో బ్లడ్‌ను ఎక్కిస్తున్నారు. కిడ్నిలు పనిచేయని పక్షంలో డయాలసిస్ చేసేందుకు ఏజెన్సీ ప్రజలు ఇతర జిల్లాలు, మహారాష్ట్ర వెల్లకుండా ప్రభుత్వం ఉట్నూర్ కేంద్రంలో ఆస్పత్రిలోని 5 పడకల డయాలసిస్ కేంద్రాన్ని మంజూరు చేసి నెలకి 30 నుంచి 40 మంది రోగులకు డయాలసిస్ చేస్తున్నారు. ఆస్పత్రి ఏర్పాటు అయినప్పటికి నుంచి గత సంవత్సరం వరకు ఆక్సిజన్ ప్లాంట్ లేదు. రోగులకు ఆక్సిజన్ ఎక్కించాల్సి వస్తే ఆదిలాబాద్ రిమ్స్ సిలిండర్లు తెచ్చుకోవాల్సిందే. ఉట్నూర్ ప్రభుత్వ సూపరింటెండెంట్‌గా వైద్యుడు జాదవ్ ఉపేందర్ పదవీ బాధ్యతలు స్వీకరించగానే జిల్లా యాంత్రంగం సహకారంతో ప్రభుత్వ ఆస్పత్రిలోనే ఏకంగా 50 బెడ్లకు సరిపడ ఆక్సిజన్ ప్లాంట్‌ను నెలకొల్పారు. రోగులకు అత్యవసర సమయంలో వైద్యం చేసేందుకు 10 బెడ్లతో ఐసీయూను ఏర్పాటు చేశారు. సీజేరియన్ అపరేషన్లు చేయాలంటే ఉట్నూర్ నుంచి 60కిలో మీటర్ల దూరంలో ఉన్న జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. దీనిని అధిగమించేందుకు ప్రభుత్వం, అధికారులు సహకారంతో నూతన హంగులతో అన్ని పరికరాలతో అపరేషన్ గదిని నిర్మించి, చరిత్రలో మొదటి సారిగా సిజేరియన్ అపరేషన్ చేసిన ఘనత ఉట్నూర్ ఆస్పత్రి సొంతం చేసుకుంది. ఇలా అస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందిస్తూ, అందరి మన్ననలు పోందుతూ వస్తుంది.

ఉట్నూర్ ప్రభుత్వాస్పత్రి జాతీయ అవార్డులు సొంతం...

ఏజెన్సీ డివిజన్ కేంద్రానికి పెద్ద దిక్కు అయిన ఉట్నూర్ ప్రభుత్వాస్పత్రిలో మరో అణిముత్యం చేరువైంది. గతంలో కాయకాల్ప జాతీయ అవార్డు సొంతం చేసుకోగా ఆస్పత్రికి ఇటీవల మరో జాతీయ అవార్డు వరించింది. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య బృందాలు చేపట్టిన సర్వేలో భాగంగా ముస్కాన్ అవార్డు వరించింది. దేశా వ్యాప్తంగా ఉన్నటువంటి ప్రభుత్వ ఆస్పత్రుల్లో చిన్నారులకు ప్రత్యేకంగా అందుతున్న వైద్యసేవలు, పలు రికార్డుల నిర్వాహణ, ఓపీడీ, ఐపీడీ, డయాలసిస్, బ్లడ్ బ్యాంక్, పాథాలజీ ల్యాబ్, ఫార్మసీ, అపరేషన్ గది, ఐసీయూ, ఎస్ఎన్‌సీయూ, ఆస్పత్రిలో పరిశుభ్రత, రోగులకు అందుతున్న వైద్య సేవలు, చిన్నారులకు, గర్భిణీలకు, బాలింతలకు, అప్పుడే పుట్టిన శిశువులకు అందుతున్న సేవలతో పాటు ఇతర విభాగాల్లో అందుతున్న వైద్య సేవల అనుగుణంగా రాష్ట్రాల పరిధిలలో సర్వేలు నిర్వహించిన కేంద్ర ప్రభుత్వ వైద్య బృందం సభ్యులు తెలంగాణ రాష్టంలో ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను ముస్కాన్ అవార్డులో భాగంగా ప్రథమ స్థానంలో ఉట్నూర్ ఆస్పత్రి చేరింది. గతంలోను కాయకాల్ప అవార్డుకు ఉట్నూర్ ఆస్పత్రి దక్కించుకోవడం విదితమే. అదే విధంగా ముస్కాన్ అవార్డు ఎంపిక కావడం పట్ల పలువురి అభినందనలు అందుకుంది.

సమీష్టి కృషితోనే సేవలు ..

జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జాదవ్ ఉపేందర్

సమీష్టి కృషితోనే ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి జాతీయ స్థాయిలో గుర్తింపు రావడంతో పాటు పలు అవార్డులు అందుకుంది. ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓ, జిల్లా వైద్యారోగ్య యాంత్రాంగం సూచనలు, సలహాలు పాటిస్తూ ఇక్కడి రోగులకు చికిత్స సేవలను ఎంతో మెరుగుపర్చాం. గతంలో ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం ఉండేది కాదు. కానీ ప్రస్తుతం ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకాన్ని బలోపేతం చేశాం. మేము పడ్డ శ్రమకు ఫలితం దక్కింది.

వర్షాకాలంలో పిల్లలకు వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వర్షాకాలంలో పిల్లలకు వచ్చే వ్యాధుల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని పిల్లల వైద్యనిపుణులు డాక్టర్ తిరుమల్‌రెడ్డి పేర్కొన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా ఆయన నవతెలంగాణతో మాట్లాడారు. వర్షాకాలంలో సాధారణంగా పిల్లలకు జలుబు, విరేచనాలు, చర్మ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఇది కాకుండా తలనొప్పి, జ్వరం, మలబద్ధకం, ఆకలి మందగించడం వంటి అనేక లక్షణాలు పిల్లల్లో కనిపిస్తాయి. డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా కేసులు కూడా వర్షాకాలంలోనే ఎక్కువగా నమోదవుతున్నాయి. పిల్లల్లో ఈ లక్షణాలు కనిపిస్తే తల్లిదండ్రులు అజాగ్రత్తగా ఉండకూడదు, వైద్యులను సంప్రదించి వెంటనే చికిత్స తీసుకోవాలి. వర్షాకాలంలో చిన్నారులకు ఫ్లూ, వైరల్ ఫీవర్, డయేరియా, టైఫాయిడ్, హెపటైటిస్, జాండిస్ (కామెర్లు) శరీర నొప్పి సర్వసాధారణం. వర్షాకాలంలో దోమలు, ఈగలు పెరుగుతాయి. ఇవి ఆహారం మీద వాలడం వల్ల అనేక వ్యాధులు వ్యాపిస్తాయి. వర్షాకాలంలో తేమ కారణంగా వైరస్‌లు, బ్యాక్టీరియాలు కూడా వృద్ధి చెందుతాయి. దీని వల్ల ఫ్లూ, ఆస్తమా, అలర్జీ, ఆస్తమా వచ్చే అవకాశం ఉంది.



ఈ వ్యాధుల నుంచి పిల్లలను ఎలా రక్షించాలి...

వర్షం పడిన తర్వాత చాలా చోట్ల మురికి నీరు పేరుకుపోతుంది. పిల్లలు నీటికి ఎక్కువగా ఆకర్షితులవుతుంటారు. చిన్న పిల్లలు దేనినైనా, ఎక్కడైనా ముట్టుకుని, అదే చేతి వేళ్లను నోటిలో పెట్టుకుంటారు. అటువంటి పరిస్థితిల్లో, వారు అనారోగ్యానికి గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ముఖ్యంగా తల్లిదండ్రులు పిల్లలను మురికి నీటిలో ఆడుకోనివ్వకూడదు. ఇంటి చుట్టూ మురికి నీరు చేరకుండా చూసుకోవాలి. పిల్లలకు బయటి ఆహారం తినిపించకండి. పిల్లలు ఆడుకోవడానికి బయటకు వెళ్లినప్పుడల్లా నిండు చేతుల దుస్తులు ధరించాలి. తద్వారా దోమలు కుట్టవు. బట్టలు తడిస్తే వెంటనే మార్చుకోవాలి. స్విమ్మింగ్ పూల్‌లో పిల్లలను ఆడుకోనివ్వకూడదు. దీనితో పాటు, పిల్లల నోటిలో వేళు పెట్టకుండా ప్రయత్నించండి. ఇంట్లో లేదా బయట పిల్లలను నీటికి దూరంగా ఉంచండి. పిల్లలు తడి బట్టలు అస్సలు ధరించకూడదు. పిల్లలకి ఏదైనా సమస్య ఉంటే, అస్సలు అజాగ్రత్తగా వహించకుండా వైద్యుడిని సంప్రదించండి.

భీంపూర్ పీహెచ్‌సీలో గర్భిణులకు మెరుగైన వైద్యసేవలు

నవతెలంగాణ-తాంసి

భీంపూర్ పీహెచ్‌సీలో గర్భిణులకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని భీంపూర్ పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ నిఖిల్‌రాజ్ డాక్టర్స్‌డేను పురస్కరించుకొని నవతెలంగాణతో మాట్లాడారు. భీంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గిరిజనులు అధికంగా ఉన్నారు. వారి ఆరోగ్యం పట్ల ఎప్పటికప్పుడు అవగాహన సదస్సులు నిర్వహించడంతో పాటు ప్రత్యేక వైద్యశిబిరాలను నిర్వహిస్తున్నాం. పీహెచ్‌సీ పరిధిలో ఆరు సబ్ సెంటర్లు ఉన్నాయి. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన రోగులు, గర్భిణులు, బాలింతలు ఆరోగ్య కేంద్రానికి వచ్చి చికిత్సలు చేసుకోవడం జరుగుతుంది. గర్భిణీలకు ప్రతి నెలలో ఒకరోజు ఒక సబ్ సెంటర్ పరిధిలో గల గర్భిణులకు అన్ని రకాల పరీక్షలు సబ్ సెంటర్‌లోనే చేసి జిల్లా కేంద్రంలోని హబ్ సెంటర్‌కు నమూనాలను తీసుకువెల్లి పరీక్షలు



చేయడం జరుగుతుంది. ఆరోగ్య కేంద్రంలో ఈ సంవత్సరం నార్మల్ డెలివరీలు 59 చేసి, వారికి కేసీఆర్ కిట్లను అందజేశాం. ఆరోగ్య కేంద్రం సిబ్బందితో పాటు ఆశ కార్యకర్తల సహకారంతో వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను, ప్రతి రోజు ఆయా గ్రామాలకు వెల్లి ప్రజలకు వర్షాకాలంలో రోగాల బారిన పడకుండా

తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రజలు రోగాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ప్రజలు ఎలాంటి రోగాల బారిన పడిన ఆరోగ్య కేంద్రానికి వచ్చి చికిత్సలు చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా గర్భిణులకు పౌష్టిక ఆహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారు. కడుపులో ఉన్న శిశువు ఆరోగ్యంగా ఉంటుంది. అలాగె నార్మల్ డెలివరీ అయ్యే అవకాశం ఉంటుంది.

ఏజన్సీ వాసులకు యాభై ఏండ్లుగా వైద్య సేవలు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



మండల కేంద్రంలో గత 50 ఏండ్లగా మండల ప్రజలతో పాటు చూట్టు పక్క గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందిస్తూ పేదల డాక్టర్‌గా గుర్తింపును డాక్టర్ దన్‌రాజ్ పొందారు. డాక్టర్స్ డే సందర్భంగా ఆయన నవతెలంగాణతో మాట్లాడారు. 1970లో మండల కేంద్రంలో చిన్న క్లినిక్‌ను ప్రారంభించాను. అంచలంచేలుగా ఎదిగి మమత నర్సింగ్ హోమ్‌ను ఏర్పాటు చేసి మండల ప్రజలకు సేవలను అందిస్తున్నాను. రాత్రనక పగలనక 24 గంటలు ప్రజలకు తన హాస్పిటల్‌లో అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తున్నాను. యాక్సిడెంట్ కేసులు, పాయిజనింగ్, ప్రసూతి కేసులకు అత్యవసర సమయాల్లో సైతం సేవలు అందిస్తున్నాను. సీజనల్ వ్యాధుల సమయంలో సర్కారు వైద్యులతో కలిసి మారుమూల గ్రామాలకు వెళ్లి ఆదివాసులకు ఉచితంగా సేవలు అందిస్తాను. సేవలను గుర్తించిన ప్రభుత్వం 2023 గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టరు సిక్తా పట్నాయక్, ఎమ్మెల్యే జోగు రామన్న, ఎస్పీ.ఉదయ్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా బెస్ట్ డాక్టర్ అవార్డును అందుకున్నా. దీంతో పాటు పేదలకు ఫీజులు తీసుకోకుండా ఉచితంగా సేవలు అందిస్తున్నా.

ప్రభుత్వ ఆసుపత్రిలో గుండె, కిడ్నీ వ్యాధి నిర్ధారణ సౌకర్యం

- సివిల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవీంద్ర ప్రసాద్

నవతెలంగాణ-బోథ్



మండల కేంద్రంలోని ప్రభుత్వ సివిల్ ఆసుపత్రిలో ప్రజల సౌకర్యార్థం ఈసీజీ, సోనోగ్రఫీ టీ హబ్ ఏర్పాటు చేసి ప్రజల గుండె, కిడ్నీ వ్యాధి నిర్ధారణ అందించేందుకు కృషి చేస్తున్నామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవీంద్రప్రసాద్ అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా నవతెలంగాణతో మాట్లాడారు. గతంలో లేని విధంగా ఇప్పటివరకు 250 కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించి 800 మందికి ఆరోగ్యశ్రీ చికిత్సలు చేయించామని తెలిపారు. అలాగే గతంలో గర్భిణులు నిర్మల్, ఆదిలాబాద్ వెళ్లేవారని, ఇప్పుడు ప్రభుత్వ ఆసుపత్రిలో స్కానింగ్ సౌకర్యం కూడా అందుబాటులో ఉందని తెలిపారు. అదేవిధంగా నేరడిగొండ, బజార్‌హత్నూర్, ఇచ్చోడ మండలలాకు గర్భిణులు స్కానింగ్‌లకు వెళ్లేవారని, ఇప్పుడు బోథ్ ప్రభుత్వాసుపత్రిలోనే సౌకర్యాలు ఉన్నందున వారికి దూరభారం తగ్గిందని తెలిపారు. రూ.46లక్షల నిధులతో అధునాతన మార్చురీ నూతన భవనాన్ని పూర్తి చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలతో పాటు ప్రజలకు ఆరోగ్య పరిస్థితులపై ప్రత్యేకంగా గైనకాలజీ డాక్టర్లలను నియమించామని పేర్కొన్నారు. నూతన ఆసుపత్రి కొరకు ప్రత్యేక శ్రద్ధ వహించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.10.50కోట్లు మంజూరు చేయించి నిర్మాణానికి కృషి చేయడం జరిగిందన్నారు. నూతన భవనం పూర్తి కాగానే డాక్టర్లు, సిబ్బంది కొరత లేకుండా ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చూస్తానని వివరించారు.

గెస్ట్‌హౌస్‌లో మొక్కను నాటిన చీఫ్ సెక్రటరీ

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని సింగరేణి గెస్ట్ హౌస్‌లో తెలంగాణ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ శాంతికుమారి శుక్రవారం మొక్కను నాటారు. ఆసిఫాబాద్ జిల్లాలో సీఎం కేసీఆర్ పోడు భూముల పట్టాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్తున్న చీఫ్ సెక్రటరీ మార్గమధ్యలో ఉన్న గెస్ట్‌హౌస్‌లో అల్పాహారం చేశారు. శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి పూల మొక్కను అందజేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి, మంచిర్యాల డిసిపి సుధీర్ రామ్నాథ్ కేకేన్, శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి, క్వాలిటీ మేనేజర్ కె వెంకటేశ్వరరెడ్డి , సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్, ఎస్టేట్స్ ఆఫీసర్ వరలక్ష్మి పాల్గొన్నారు.



బాసర ఆలయం వద్ద మహా అన్నదానం

బాసర : సరస్వతిదేవి అమ్మవారి ఆలయంలో ప్రతి ఏటా ఆషాడమాసంలో ఆనవాయితీగా జరిపే మహా అన్నదాన కార్యక్రమాన్ని శుక్రవారం గ్రామస్తులు, వీడీసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయంలోని అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేసి, ఆలయ అవరణలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఏటా ఈ కార్యక్రమం జరిపిన అనంతరం పాడిపంటల పనులను ప్రారంభించడం రైతుల ఆనవాయితీ. అన్నదాన కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కుమురం భీం విగ్రహ ప్రతిష్ఠాపనను విజయవంతం చేయాలి

సిరికొండ : కుమురం భీం విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు గోడం గణేష్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆదివాసులతో కలిసి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆదివాసుల హక్కుల కోసం జల్ జంగిన్ జల్ జమీన్ అనే నినాదంతో పోరాటం చేసిన గొప్ప మహనీయుడని కొనియాడారు. మండలంలోని ఆదివాసులంతా తరలివచ్చి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

గిరిపల్లెలో నాణ్యమైన వైద్య సేవలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



రాష్ట్రంలో ఇతర జిల్లాలతో పోలిస్తే కుమురంభీం, ఆసిఫాబాద్ జిల్లా ప్రత్యేకమైనది. భిన్న సంస్కృతి సంప్రదాయాలతో పాటు ఆహారపు అలవాట్లు, ఉంటూ ఆదివాసి ప్రజలు ఎక్కువగా అనారోగ్య బారిన పడుతుంటారు. వారందరికీ నాణ్యమైన వైద్య సేవలు అతి తక్కువ ధరకు అందిస్తున్నామని చెబుతున్న డాక్టర్ శ్రీనివాస్ 'వైద్య దినోత్సవ' సందర్భంగా నవతెలంగాణతో వారు అందిస్తున్న వైద్య సేవలు పంచుకున్నారు. ఆదివాసి ప్రాంతాల్లో అనేకమంది డెలివరీల సమయంలో నాటు వైద్యాన్ని ఆశ్రయిస్తూ ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ విషయాన్ని గుర్తించి నాణ్యమైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో తాను సర్జన్‌గా, తన భార్య డాక్టర్ కేవీ లక్ష్మి గైనకాలజిస్ట్‌గా పనిచేస్తూ ఆసుపత్రి ప్రారంభించామన్నారు. ఆదివాసీలకు అనుకూలంగా అతి తక్కువ ధరలకు సేవలు ఇస్తున్నామని తెలిపారు. వైద్యవృత్తి ఎంతో గొప్పనైనదని దానికి మరింత వన్నె తెచ్చే విధంగా చేయడమే తమ లక్ష్యం అన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవలు అందుబాటులోకి తీసుకువస్తామని తాము తీసుకువచ్చే సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలోని ప్రజలకు తన తోటి వైద్యులకు 'వైద్య దినోత్సవ శుభాకాంక్షలు' తెలిపారు.

'ఎక్కువగా పెయిన్ కిల్లర్స్ తీసుకోవద్దు'

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



సాధారణంగా వయస్సు పైబడిన వృద్ధులకు కీళ్ల నొప్పులు, మోకాళ్ళ నొప్పులు సాధారణంగా వస్తాయని వీటి ఉపశమనానికి పెయిన్ కిల్లర్స్ వాడుతున్నారని అవి ఎక్కువగా వాడకూడదని ఐఎంఏ జనరల్ సెక్రటరీ, ఎముకల వైద్యనిపుణులు డాక్టర్ పరిమల శ్యాంప్రసాద్ అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా ఆయన నవతెలంగాణతో మాట్లాడారు. గ్రామాల్లో కీళ్ల, మోకాళ్ల నొప్పుల చికిత్సకు ఆర్ఎంపీలను సంప్రదించి ఉపశమనం కోసం పెయిన్ కిల్లర్ ఇంజెక్షన్ ఇవ్వడం, గ్లూకోస్ పెట్టడం జరుగుతుంది. వీటిని మోతాదుకు మించి వాడకూడదు. ఎక్కువ డ్రగ్స్ తీసుకోవడంతో బొక్కలు బలహీనపడుతాయి.

యువత ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నేటి యువత ప్రమాదాల బారిన ఎక్కువగా పడుతున్నారు. ఎక్కువగా మద్యం తాగి వాహనాలు నడుపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో ఆస్పత్రుల పాలై మంచాన పడుతున్నారు. అంగవైకల్యంతో తమ జీవితాన్ని అందకారంలోకి నెట్టివేయబడుతున్నారు.యువత వీటి నుంచి బయటపడి రోడ్డు భద్రతా నియమాలను పాటించి, సురక్షితమైన ప్రయాణాలు చేయాలి.

ప్రజాసంఘాల నాయకుల ముందస్తు అరెస్ట్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలో సీఎం పర్యటన నేపథ్యంలో గురువారం రాత్రి జిల్లా కేంద్రంలోని ప్రతిపక్ష నాయకులు, ప్రజాసంఘాల నాయకులను ముందస్తు అరెస్టు చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేసే హక్కు ప్రతి ఒక్కరికి ఉంటుందని ప్రజా నాయకులుగా పరిష్కారం కోసం కృషి చేయాలి కానీ అక్రమంగా అరెస్టు చేయడమేంటని ప్రశ్నించారు. అక్రమ అరెస్టులపై ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధ జిల్లాలో ఉన్న సమస్యల పరిష్కారంపై చూపాలన్నారు. అరెస్టులతో నిరసన ఆపాలని చూడడం వృధా ప్రయత్నమే అని సూచించారు. జిల్లా సమస్యలపై ముఖ్యమంత్రి కేసీఆర్ సభాముఖంగా హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు రాజ్యం అని చెబుతున్న కేసీఆర్ జిల్లాలో ఉన్న అడ ప్రాజెక్టు కూలిపోవడానికి సిద్ధంగా ఉందని, జగన్నాథ్ పూర్ ప్రాజెక్టు పూర్తి కాలేదని, వట్టి వాగు ప్రాజెక్టు గనుల నిర్మాణంతో పోసిన మట్టి ద్వారా కూడిపోతుందని వీటి అభివృద్ధిపై స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. ముందస్తు అరెస్ట్ అయిన వారిలో సీపీఐ(ఎం) జిల్లా నాయకులు అల్లూరి లోకేష్, దుర్గం దినకర్, కాంగ్రెస్ జిల్లా నాయకులు మసాడే చరణ్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గుండా శ్యామ్, టీఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోల్కర్ సాయిరాం, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి జగజంపుల తిరుపతి, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఎండీ ఆసిఫ్ ఉన్నారు.

మెరుగుపడ్డ సర్కారు వైద్యం..!

- కార్పొరేట్‌కు ధీటుగా సౌకర్యాలు
- జిల్లాకు మెడికల్, నర్సింగ్ కళాశాలలు
- వైద్య సేవలో విప్లవాత్మక మార్పులు

సమైక్య పాలనలో అధ్వాన స్థితిలో ఉన్న వైద్య రంగాన్ని, స్వరాష్ట్ర పాలనలో ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిచ్చి ఆధునిక వైద్యం అందిస్తోంది. ఆరోగ్య తెలంగాణనే లక్ష్యంగా కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ ఆస్పత్రులను తీర్చి దిద్దుతోంది. 10 పడకలను 30కి 30 పడకలను 100పడకల ఆస్పత్రిగా 100 పడకల ఆస్పత్రిని 300 పడకల ఆస్పత్రులుగా మారుస్తూ మంచిర్యాల జిల్లాలో నాన్యమైన వైద్య సేవులు అందిస్తోంది. సర్కారు వైద్యమే దండగ అనుకునే పరిస్తితిని తిరగరాసి, సర్కారు వైద్యమే మేలు అనే స్థాయికి వచ్చింది. జిల్లాలో వైద్య కళాశాల మంజూరు చేయటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. డాక్టర్స్ డే సందర్భంగా జిల్లాలో వైద్య సేవలపై ప్రత్యే కథనం..

నవతెలంగాణ-హాజీపూర్

జిల్లాకు మెడికల్, నర్సింగ్ కళాశాలలను మంజూరు చేసి జిల్లా ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చారు. చెన్నూర్, లక్షెట్టిపేటలో 200 పడకల దవాఖానలను నిర్మించేందుకు నిధులు మంజూరు చేయగా, పనులు శరవేగంగా సాగుతున్నాయి. బెల్లంపల్లి నియోజకవర్గ కేంద్రంలో 50 పడకల ఆసుపత్రి నిర్మించగా, ప్రస్తుతం అందు బాటులోకి వచ్చింది. 100 ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలను పల్లె దవాఖానాలుగా మార్చింది. 73 పల్లె దవాఖానాలకు కొత్త బిల్డింగ్‌లు నిర్మించేందుకు ఒక్కో ఆస్పత్రికి రూ.20 లక్షల చొప్పున మంజూరు చేసింది.

జిల్లా పెరుగుపడిన వైద్య సేవలు

తెలంగాణ రాకముందే జిల్లా వ్యాప్తంగా 17 పీహెచ్సీలు, 3 హెల్త్ సెంటర్లు, 4 అర్బన్ హెల్త్ సెంటర్లు, 149 ఉప కేంద్రాలుండేవి. తెలంగాణ వచ్చాక లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రి శిథిలావస్థకు చేరగా, రూ.8 కోట్లతో 50 పడకల దవాఖానను నిర్మిస్తున్నారు. జిల్లా కేంద్రం కాలేజ్ రోడ్డులో రూ.17 కోట్లతో మాతా శిశు ఆరోగ్య కేంద్రం నూతన భవనం నిర్మించింది. రూ.12 కోట్లతో ప్రభుత్వ వైద్య కళాశాల మంజూరు చేయగా, 100 మంది విద్యార్థులతో 2022-23 అకాడమిక్ ఇయర్‌కు సంబంధించిన క్లాసులు ఇప్పటికే ప్రారంభమ య్యాయి. జైపూర్ మండలం కుందారంలో కొత్తగా పీహెచ్‌సీ నిర్మించేందుకు రూ.2 కోట్లు కేటాయించింది. జిల్లాలో 42. ఉప ఆరోగ్య కేం ద్రాలకు కొత్త భవనాల కోసం రూ.10 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. నాలుగు బస్తీ దవాఖనాలు ఏర్పాటు



చేసింది. ఒక్కో ఆస్పత్రికి రూ.13 లక్షల చొప్పున రూ.52 లక్షలు వీటికి ఖర్చు చేసింది. హమాలీవాడ, సాయికుంట, చెన్నూర్, బెల్లంపల్లి రడ గంబాలలో బస్తీ దవాఖానలను అందుబాటులోకి తెచ్చింది. 100 ఉప ఆరోగ్య కేంద్రాలు పల్లె దవాఖానాలుగా మారాయి. జిల్లాలో వైద్య, ఆరోగ్య శాఖలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 34 కాంట్రా క్ట్ ఉద్యోగులు, 25 మంది మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్లు, 8 మంది ల్యాబ్ టెక్నీషియన్‌లు, 1ఫార్మసిస్ట్ సహా 16మంది కాంట్రాక్ట్ వైద్యులను రెగ్యులరైజ్ చేసింది. ఈ ఏడాది రూ.2 కోట్లతో సెంట్రల్ డ్రగ్ స్టోర్‌ను ప్రారంభించనుంది. కాలేజీ రోడ్డులో నూతనంగా తెలంగాణ డయోగ్నస్టిక్ సెంటర్‌ను ఏర్పాటు చేయటంతో అది ప్రారంభానికి సిద్ధంగా ఉంది.

వ్యాధులు ప్రబలకుండా పటిష్ట చర్యలు

- జిల్లా వైద్యాధికారి కె.రామకృష్ణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వైద్యుడు నిత్యం అప్రమత్తంగా ఉంటేనే ప్రజలు బాగుంటారని, దానికి కట్టుబడి అహర్నిశలు ప్రజారోగ్యం కోసం ప్రయత్నం చేస్తూ వెనుకబడిన జిల్లాలో అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తామని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పటిష్ట చర్యలు తీసుకున్నామని జిల్లా వైద్యాధికారి కె.రామకష్ణ అన్నారు. 'వైద్య దినోత్సవం' సందర్భంగా నవతెలంగాణతో మాట్లాడారు. వైద్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రాల్లో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా గతంలో ఎన్నడూ లేనివిధంగా 30 మంది వరకు సిబ్బంది రక్తదానం చేసే విధంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఇప్పటికే క్లష్టర్ల వారికి విభజించినట్లు వివరించారు. గాలి, నీరుతో వచ్చే వ్యాధులను వేరువేరు చేసి వాటి నివారణ కోసం చర్యలు తీసుకుంటున్నామన్నారు. గత వర్షాకాలంలో జిల్లాలోని లింగాపూర్, సిర్పూర్, దహేగాం లాంటి ప్రాంతాల్లో



వరదలు వచ్చాయని గర్భిణులు ఇబ్బందులు పడకుండా ముందస్తుగా హై రిస్క్ గర్భిణీ కేసులు గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలిపారు. డయాలసిస్ పేషెంట్లను కూడా సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నామన్నారు. అవుట్ పేషెంట్ సర్వీస్‌లకు అవసరమైన మందులను స్థానికంగా అందుబాటులో ఉంచే విధంగా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. పంచాయతీరాజ్ విభాగంతో సమన్వయం చేసుకొని నీరు నిలువ లేకుండా ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారిగా రాపిడ్ రెస్పాన్స్ టీం ఏర్పాటు చేశామని దీనిలో ఒక మెడికల్ ఆఫీసర్, సూపర్‌వైజర్, ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్‌తో పాటు స్థానిక ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు సభ్యులుగా ఉంటారని తెలిపారు. జిల్లాలో 22 ఆసుపత్రులు ఉన్నాయని, వీటన్నింటినీ ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి రానున్న రోజుల్లో ప్రతిరోజు నాలుగు ఆస్పత్రుల చొప్పున తనిఖీ చేస్తానని తెలిపారు. దీనివల్ల ఆస్పత్రికి పరిసరాలతో పాటు సేవలు మెరుగయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. సీజనల్ వ్యాధుల నిర్మూలన కోసం నీటి నిల్వల వద్ద మందులు స్ప్రే చేసినట్లు తెలిపారు. జిల్లాలో నాణ్యమైన వైద్య సేవలు ప్రజలకు అందే విధంగా అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. వైద్య శాఖలో కింది స్థాయి వరకు సిబ్బంది కూడా మనస్ఫూర్తిగా పనిచేయాలని అన్నారు. జిల్లాలోని వైద్యులకు వైద్యశాఖ సిబ్బందికి "వైద్య దినోత్సవ శుభాకాంక్షలు" తెలిపారు.

మహిళలకు మెరుగైన వైద్య సేవలు

- కుందారం ఆసుపత్రి వైద్యురాలు శ్రావ్య

నవతెలంగాణ-జైపూర్

కుందారం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం ద్వార మహిళల కోసం అందిస్తున్న ప్రత్యేక వైద్య సేవలు సధ్వినియోగం చేసుకోవాలని ఆసుపత్రి వైద్యురాలు శ్రావ్య కోరారు. వైద్యుల దినోత్సవం సందర్భంగా నవతెలంగాణతో మాట్లాడుతూ మహిళలకు సంబంధించి ప్రధానంగా 8 రకాలైన వ్యాధులకు ప్రతి మంగళవారం ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గర్భిణులకు కేసీఆర్ న్యూట్రీషన్ కిట్టు, ప్రసూతి అనంతరం కేసీఆర్ కిట్టు అందజేయడం



జరుగుతుందని తెలిపారు. న్యూట్రీషన్ కిట్టు ద్వార తల్లికి అనేమియా తగ్గిస్తూ బిడ్డల ఎదుగుదలకు ఎంతగానో ఉపకరిస్తుందని అన్నారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వార పంపిణీ చేస్తున్న కోడి గుడ్లు, పాలు తీసుకోవడంతో పాటు గర్భిణులు ఆకు కూరలు ఎక్కువగా తీసుకోవడం శ్రేయస్కరమని తెలిపారు. ఆశా కార్యకర్తలు తెలియజేసిన విధంగా గర్భిణులు స్వల్పమైన వ్యాయామం చేయడం ద్వార సాధారణ ప్రసవానికి అవకాశం ఉంటుందని తెలిపారు.

c m y k

ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి

- మరింత మెరుగైన వైద్య సేవలందిస్తాం • దవాఖానలు పరిశుభ్రంగా ఉండేలా చూస్తాం
- మాతా శిశు సంరక్షణ, కీటక జనిత వ్యాధుల నియంత్రణకు కృషి
- ప్రైవేట్ హాస్పిటల్స్‌ను తనిఖీ చేస్తాం • జిల్లాలో 4 మహిళా ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు
- మంచిర్యాల జిల్లా వైద్యాధికారి సుబ్బారాయుడు

ప్రజారోగ్యంపై మరింత దృష్టి సారించాం. ప్రభుత్వ దవాఖా నాలను పరిశుభ్రంగా ఉంచుతాం. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తాం. మాతా శిశు సంరక్షణకు కషి చేసి తల్లీబిడ్డలకు భరోసా కల్పిస్తూ మహిళల కోసం జిల్లాలో ప్రత్యేకంగా 4 ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేశాం. సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందస్తు చర్యలు తీసుకున్నాం. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ప్రైవేట్ దవాఖానల్లో తనిఖీలు చేస్తాము. ఎక్కడ లోపాలు కనిపించినా .. నిబంధనలు ఉల్లంఘించిన చర్యలు తీసుకుంటామని మంచిర్యాల జిల్లా వైద్యాధికారి సుబ్బారాయుడు అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా ప్రత్యేకంగా నవతెలంగాణతో ఆయన మాట్లాడారు.

నవతెలంగాణ-హాజీపూర్

ప్రజారోగ్యం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, కీటక జనిత వ్యాధుల నియంత్రణ (ఎన్‌పవీడీపీ) కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రతి వారం డ్రై డే పాటిస్తు నీటి నిల్వలు, చెత్తను తొలగించే కార్యమాలు చెపడుతున్నామన్నారు. సీజనల్ వ్యాధుల వివారణ చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ఎన్‌పవీబీడీపీలో భాగంగా ఆశ , అంగన్వాడీ, ఆరోగ్య కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శి, మహిళా సమాఖ్య సభ్యులు, ఎన్జీజీవోలతోపాటు వివిధ వర్గాల వారి సేవలు వినియోగించుకుంటున్నామని తెలిపారు. మురుగు కాలువలు, నీరు నిల్వ ఉంటే పంచా యతీలు, మున్సిపల్ సిబ్బందితో శుభ్రం చేయిస్తున్నామన్నారు.

మాతా శిశు సంరక్షణకు చర్యలు

ప్రభుత్వ దవాఖానల్లో అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, గర్భిణులకు నెలనెలా పరీక్షలు మొదలు.. డెలివరీ అయ్యే వరకు అన్ని రకాల సేవలందిస్తుమన్నారు. అంబులెన్స్‌లో తీసుకొచ్చి పరీక్షల అనంతరం జాగ్రత్తగా వారిని ఇంటి వద్దకు వాహనాల్లో సిబ్బంది చేరుస్తున్నారని తెలిపారు. కేసీఆర్ కిట్ల పంపిణీతో సర్కారు దవాఖానల్లో ప్రసవాల సంఖ్య పెంరిందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల వారు ఈ సేవలను సద్వినియోగం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. పీహెచ్‌సీల్లో ఎలాంటి సిబ్బంది కొరత లేదని, మందులు కూడా అందుబాటులో ఉన్నాయని అన్నారు. మహిళల కోసం ప్రత్యేకంగా జిల్లాలో 4 ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. జన్నారం, హమాలివాడ, కుందారం, తాళ్ళ గురిజాలలో మహిళలకు ప్రత్యేక ఆరోగ్య కేంద్రాలు కొనసాగుతున్నాయని తెలిపారు. గర్భిణులకు జూన్ 14 నుంచి న్యూట్రిషన్ కిట్లు అందజేస్తున్నట్టు తెలిపారు.



సీజనల్ వ్యాధుల నియంత్రణకు సిబ్బంది అప్రమత్తం

ఇంటింటికీ, సబ్ సెంటర్ల లోకి వెళ్లి విరివిగా వైద్య సేవలందిస్తు.. ఇండ్ల ప్రాంతాల్లో నీరు నిల్వకుండా పారబోయిస్తున్నామని అన్నారు. మారు మూల పల్లెల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి జిల్లాలో మలేరియా, చికున్ గున్యా, డెంగ్యూ కేసులు పెరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారని పేర్కొన్నారు. వీరు రెండు సీహెచ్సీల చొప్పున గ్రామాల్లో రోజుకు 100 ఇండ్లకు వెళ్తు న్నారని తెలిపారు. ఇంట్లో సభ్యుల ఆరోగ్య వివరాలు, వ్యాక్సిన్ వివరాలు సేకరిస్తు వారికి జాగ్రత్తలు సూచిస్తున్నారని చెప్పారు. అందరి భాగస్వామ్యంతో మెరుగైన సేవ లందించేందుకు కషిచేస్తామని ఇబ్బందులు కలుగ కుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు.

ప్రయివేటు ఆస్పత్రులపై ప్రత్యేక నిఘా

జిల్లాలో 280 రిజిస్టర్డ్ అయిన ప్రయివేటు ఆస్పత్రులు ఉన్నాయని, వాటిపై ప్రత్యే నిఘా పెడుతున్నామని తెలిపారు. నిబందనలకు విరుద్దగా వ్యవహరిస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీలో భాగంగా వాటిని పరిశీలిస్తాము ధరల పట్టికలు, వైద్యుల వివరాల బోర్డులు డిస్ ప్లే చేయాల్సి ఉంటుందని అన్నారు. పార్కింగ్ స్థలాలు, ఆస్పత్రుల్లో అందుతున్న సేవలపై క్షేత్ర పర్యటనల్లో తెలుసుకుని ప్రయివేటు హాస్పిటల్స్, నర్సింగ్ హోంలకు సంబంధించి యాక్ట్ పరంగా తీసుకోవాల్సిన చర్యలపై నోటీసులు, సాధా రణ ఉత్తర్వులు జారీ చేస్తామని అన్నారు. లోపాలకు సంబంధించి ప్రత్యేకించి ఎవరైనా ఫిర్యాదు చేసినా, నిబంధనలు ఉల్లంఘించినా.. ప్రయివేటు హాస్పిటల్స్‌పై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యం



నవతెలంగాణ-వాంకిడి

గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యమని జడ్పీటీసీ డాక్టర్ అజయ్‌కుమార్ అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా నవతెలంగాణతో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రజలకు అన్ని విధాలుగా వైద్యం అందించడం కోసం గ్రామీణ ప్రాంతాల్లోని ఆర్ఎంపీ డాక్టర్లు ముందుండి ప్రజలకు వైద్య సేవలందిస్తున్నారని తెలిపారు. చాలా గ్రామాల నుంచి మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి రావడానికి సరైన సౌకర్యాలు లేకపోవడంతో ఆయా గ్రామాల్లో పనిచేస్తున్న ఆర్ఎంపీ వైద్యులు సేవలందించడం నిరుపేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉందని అన్నారు. దూరప్రాంతాల నుంచి మండలకేంద్రానికి రావాలంటే గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ఆర్థిక స్తోమత లేకపోవడంతో అక్కడి ప్రజలకు ఆర్ఎంపీ వైద్యులు అందుబాటులో ఉండి వైద్యం అందిస్తున్నారని, ప్రభుత్వం కూడా గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఆర్ఎంపీ డాక్టర్లను గుర్తించాలని, అవసరమైన మందులను అందించినట్టయితే నాణ్యమైన సేవలు అందిస్తారని అన్నారు. మండలంలో చుట్టుప్రక్కల 15 కిలోమీటర్ల మేర గ్రామాల నుండి మండలకేంద్రానికి చేరుకునేందుకు రవాణ సౌకర్యం లేకపోవడంతో అత్యవసర సమయాల్లో ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. అలాంటి గ్రామాల్లో ప్రభుత్వం అంబూలెన్సులను అందుబాటులో ఉంచినట్టయితే ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. ప్రతిసారి మండలకేంద్రానికి రావాలంటే డబ్బులు కూడా లేని పరిస్థితిలో చాలామందికి వైద్యం అందే పరిస్తితి లేదని, అటువంటి వారికి ఆర్ఎంపీ వైద్యులు ఎంతో ఉపయోగ పడుతున్నారని వివరించారు. మారు మూల గ్రామాలను ఎంపిక చేసి ప్రభుత్వం సాయం అందించాలని ఆయన కోరారు. మారుమూల గ్రామాలకు ఆర్ఎంపీ డాక్టర్‌లు వెళ్లి ప్రథమ చికిత్స అందించి నిరుపేదల ప్రాణాలను కాపాడానికి ఉపయోగపడుతున్నారని పేర్కొన్నారు. ఆర్ఎంపీలను బలోపేతం చేయడానికి అందరికి అందుబాటులో ఉంటూ తమ సహాయ సహకారాలను అందించడమే తమ లక్ష్యమన్నారు. ఎలాంటి ఇబ్బందులున్నా ఆర్ఎంపీ డాక్టర్లకు అన్ని వేళల అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించి తమవంతు సహకారం అందిస్తున్నామని తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- పరిసరాల పరిశుభ్రత తప్పని సరి
- సింగరేణి వైద్యుడు లోకనాథ్‌రెడ్డి



నవతెలంగాణ-నస్పూర్

వర్షాకాలంలో సంక్రమించే సిజనల్ వ్యాధులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సింగరేణి వైద్యుడు లోకనాథ్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ఆయన నవతెలంగాణతో మాట్లాడారు. వర్షాలతో ఎక్కువ నీరు నిలవడం ద్వారా దోమలు బెడదత తీవ్రంగా ఉంటుందని, నివాస ప్రాంతాల్లో మురికి నీరు నిల్వకుండా జాత్రలు తీసుకోవాలని సూచించారు. తద్వారా దోమలు దరిచేరవని, డెంగ్యూ, మలేరియా లాంటి ప్రాణాంతక వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. డెంగ్యూ వ్యాధి అనేది దోమల ద్వారా వ్యాప్తి చెందే భయంకరమైన వ్యాధి అని అన్నారు. ఇది ఏడీఎస్ ఈజిప్టై దోమ కుట్టడం వల్ల ఈ వైరస్ ప్రబలుతోందని, ఈ దోమను టైగర్ దోమ అని కూడా అంటారన్నారు. ఈ దోమలు పగటిపూటే కుడుతాయని, ఈ దోమ కుట్టిన ఐదు నుంచి ఎనిమిది రోజుల తరువాత వ్యాధి లక్షణాలు కనిపిస్తుంటాయన్నారు. డెంగ్యూ వ్యాధి వచ్చిన రోగిని కుట్టిన దోమ మరొకరిని కుట్టినా ఈ వైరస్ వ్యాప్తి చెందుతుందన్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతుండటం వల్ల దోమల బెడద ఎక్కువగా ఉంటుందని, ఈ కాలంలోనే డెంగ్యూ వేగంగా వ్యాప్తి చెందుతుందని, ఈ వ్యాధి లక్షణాలు ఎలా ఉంటాయో ప్రతి ఒక్కరు తెలుసుకోవడం మంచిదన్నారు.

డెంగ్యూ లక్షణాలు

డెంగ్యూ లక్షణాల్లో ప్రధానమైనది విపరీతంగా తలనొప్పి వచ్చి తల భారంగా మారుతుంది. డెంగ్యూ సోకిన వారికి జ్వరం వస్తూ పోతూ ఉంటుంది. ఒక్కసారిగా జ్వర తీవ్రత 104 డిగ్రీల ఫారన్‌హీట్ వరకు పెరుగుతుంది. ఇలా తరచూ జరుగుతుంటే వెంటనే డాక్టరును సంప్రదించాలి. ఎందుకంటే ఆ జ్వరం డెంగ్యూకి దారితీయొచ్చు వ్యాధి సోకితే కీళ్ల నొప్పులు, కండరాల నొప్పులు ఎక్కువగా ఉంటాయి. రక్తస్రావం అనేది డెంగ్యూ లక్షణాల్లో ప్రధానమైన స్థాయిగా పరిగణించవచ్చు. డెంగ్యూ ఉంటే ముక్కు (శ్లేష్మ పొర) నుంచి రక్తస్రావం జరుగుతుంది. వ్యాధి తీవ్రస్థాయికి చేరుకున్నప్పుడు ఈ రక్తస్రావం అధికంగా ఉంటుంది. అలాంటి సందర్భాల్లో వ్యాధిగ్రస్తుడు చనిపోయే అవకాశం ఉంటుంది. వాంతులు-వికారం నోరు ఎండిపోతుంది. మాటిమాటికీ దాహం వేస్తుంది. అలాగే కడుపులో కాస్త నొప్పిగా, వికారంగా ఉండటం.. వాంతి అవుతున్నట్లు అనిపిస్తుంది. ఒక వేళ ఈ లక్షణాలు గనుక ఎవరికైనా ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించడం మేలని, వ్యాధి ఉందో లేదో నిర్ధారణ చేసుకోవాలని సూచించారు. ఎందుకంటే తెల్లరక్తకనాలు (ప్లేట్లెట్స్) సంఖ్య బాగా తగ్గిపోతుందని, అలా జరిగితే ప్రాణానికే ప్రమాదం అని తెలిపారు.

నివారణ చర్యలే మార్గం

డెంగ్యూను నివారించడానికి ఎలాంటి టీకాలు లేవు. దోమ కాటుకు గురి కాకుండా నిరణ చెర్యలు మాత్రమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఇంటి సమీపంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. నీటి ట్యాంకులకు మూత వేసి, వర్షపుని నిల్వ ఉండే కుండీలు, టైర్లు, కొబ్బెరి చిప్పలు, లాంటి వాటిలో నీరు నిల్వ ఉంటే వారానికి ఒక సారి శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఇంట్లో దోమలు తిరుగుతున్నట్లు అనిపిస్తే వెంటనే దోమ తెరలను అమర్చుకోవాలి. వాటిని తరిమికొట్టే కొన్ని నివారణ మందులు వాడాలి. శరీరంలోని అన్ని భాగాలకు రక్షణ కలిగే విధంగా దుస్తులు ధరించాలి. పిల్లలకు శరీర భాగాలు పూర్తిగా కప్పేటట్లు దుస్తులు వేయాలి.ఈ డెంగ్యూ దోమలు పూల తొట్టెలు, నీటి ట్యాంకులు, టైర్లల్లో గుడ్లు పెడతాయి.

ఆరోగ్య కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- మెడికల్ ఆఫీసర్ అనిల్ కుమార్



నవతెలంగాణ-జైపూర్

మారుమూల ప్రాంతాల వారికి అందుబాటులో సేవలందిస్తున్న ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జైపూర్ మెడికల్ ఆఫీసర్ అనిల్ కుమార్ అన్నారు. వైధ్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నవతెలంగాణతో మాట్లాడుతూ సీజనల్‌గా వచ్చే అనారోగ్య సమస్యలను అదిగమించడం కోసం వర్షా కాలంలో కాచి వడబోసిన నీటిని తాగడం శ్రేయస్కరమని అన్నారు. వర్షాకాలంలో వేడిగా వండుకున్న ఆహారాన్ని భుజించాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఇంటి పరిసరాల్లో మురికి నీరు నిలువకుండా జాత్రలు తీసుకోవాలని, వారంలో ఒకరు రోజు నీటి కుండలు, డ్రమ్ములు ఎండలో ఆరబెట్టాలని అన్నారు. కాగా మండల కేంద్రంతో పాటు కుందారంలో గల ఆరోగ్య కేంద్రంతో పాటు అవసరాల మేరకు ఉప ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేసి సేవలందిస్తున్నామని తెలిపారు.


లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

జన్నారం : మండలం లయన్స్ క్లబ్ 2023-24, సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని శుక్రవారం మండల కేంద్రంలోని ఆర్ఆర్ఎస్ గార్డెన్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లయన్ శెట్టి రాజశేఖర్, సెక్రటరీగా లయన్ వావిలాల రాజేందర్, కోశాధికారిగా లయన్ వెలగందుల సురేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకొని డిస్టిక్ లైన్ అధికారి సురేష్ వారితో ప్రమాణ స్వీకారం చేయించారు.

చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడాలి


నవతెలంగాణ-కోటపల్లి

మొక్కలు నాటే పచ్చదనాన్ని పెంపొందించాలని జనగామ సర్పంచ్ గట్టు లక్ష్మణరావు పిలుపునిచ్చారు. శుక్రవారం గ్రామంలోని ప్రతి ఇంటికి నర్సరీలో పెంచినటువంటి ఆరు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలను పెంచడం ప్రతి వ్యక్తి కర్తవ్యం అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన పల్లె ప్రగతి మహత్తరమైన కార్యం అని అందరూ భాగస్వాములు కావాలని అన్నారు.ప్రతి ఇంట్లో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచి పర్యావరణాన్ని కాపాడాలని అన్నారు.











పల్లె చెంతకే వైద్యం..!

(మొదటి పేజీ తరువాయి)

జ్వరాలు ప్రబలడం సాధారణంగా మారుతోంది. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలో అనేక మంది వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్నారు. దీంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్యఆరోగ్యశాఖ గత రెండేండ్లుగా ఇంటింటి ఫీవర్ సర్వే చేపడుతోంది. ఏగ్రామంలోనైనా జ్వరంతో బాధపడితే వెంటనే అక్కడే మందులు అందిచడం..అవసరమైతే మెడికల్ క్యాంపులు ఏర్పాటుచేయడం వంటి చర్యలు చేపడుతున్నారు. దీంతో జ్వరాలు త్వరగా నియంత్రణలోకి వస్తున్నాయి. ముఖ్యంగా పీహెచ్‌సీల్లో అన్ని రకాల రక్త పరీక్షలు చేయించుకునేందుకు అవకాశం ఉంది. ఇక్కడ అందించిన రక్త నమూనాలను ప్రత్యేక వాహనంలో టీ డయాగ్నోస్టిక్ కేంద్రాలకు పంపిస్తున్నారు. దీంతో మరుసటి రోజున ఆన్‌లైన్‌లోనే సంబంధిత వ్యక్తుల రక్త పరీక్షల రిపోర్టులు వస్తున్నాయి. దీంతో అనేక మంది పేదలు రక్త పరీక్షల కోసం రూ.వేలలో డబ్బులు ఖర్చు చేసే అవసరం లేకుండా పోయింది.







అనుదినం జనపక్షం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
1
శనివారం 01 జులై 2023

బీటీ రోడ్డు పనులు ప్రారంభించిన ఎంపీపీ

నవతెలంగాణ-దస్తురాబాద్

మండలంలోని బూత్కూర్ గ్రామ పంచాయతీలోని రాంపూర్ గ్రామంలో బీటీ రోడ్డు పనులను శుక్రవారం సింగారి కిషన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మట్టి రోడ్డులో నడవాలంటే పరిస్థితి భయాందోళనకరంగా ఉండేదన్నారు. ఎమ్మెల్యే రేఖానాయక్ ఆదేశాల మేరకు బిటి రోడ్డు వేశామని, ఆమెకు రుణపడి ఉంటామని తెలిపారు. నాణ్యత ప్రమాణాలతో బిటి రోడ్డు నిర్మించాలని గుత్తేదారును ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మారాజు పోసవ్వ, సత్యం, రాజ, వెంకన్న గ్రామస్తులు పాల్గొన్నారు.



ఈపీ టెక్నీషియన్లకు కౌన్సెలింగ్ నిర్వహించాలి

రెబ్బెన : సింగరేణిలో ఈపీ టెక్నీషియన్లకు కౌన్సెలింగ్ నిర్వహించాలని టీబీజీకేయస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజ్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. జూన్ 28వ తేదీన కౌన్సిలింగ్ నిర్వహణ కోసం సింగరేణి యాజమాన్యం ఆదేశాలు జారీ చేసిందని, కేవలం ఒక్కరోజు ముందే కౌన్సిలింగ్ ప్రక్రియను నిలిపివేయడం అన్యాయమన్నారు. కొందరు చెప్పిన మాటలు నమ్మి సింగరేణి యాజమాన్యం ఒక క్రమపద్ధతిలో జరుగుతున్న కౌన్సిలింగ్ విధానాన్ని ఇష్టంవచ్చినట్టు మార్చడం సరైందికాదన్నారు. జూలై మొదటి వారంలో కౌన్సెలింగ్ నిర్వహించి అందరికి అవకాశం కల్పించాలని ఆయన కోరారు. ఖైరిగూడ ఓపెన్‌కాస్టులో శుక్రవారం ఆయన పర్యటించి ఈపీ టెక్నీషియన్‌లతో కలిసి చర్చించారు. కార్యక్రమంలో టీబీజీకేయస్ ఫిట్ కార్యదర్శి కార్నాదం వెంకటేశ్, జీఎం కమిటీ మెంబర్లు గజ్జెల్లి చంద్రశేఖర్, మారిన వెంకటేశ్, మాజీ ఉపాధ్యక్షుడు నలగొండ సదాశివ్, అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శులు భాస్కరాచారి, మతాడి నారాయణ, నాయకులు రాజేశం, అంజయ్య, శివకుమార్, భిక్షపతి, భాగ్యలక్ష్మి, మేకర్తి మల్లేష్, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

పోడుకు మోక్షం..గిరిజనుల్లో హర్షం..!

- 47వేల ఎకరాలకు హక్కుపత్రాలు పంపిణీ
- మహారాష్ట్రకు వెళ్లేందుకు వార్దా నదిపై వంతెన
- రూ.75కోట్లు మంజూరు..కాగజ్‌నగర్‌లో ఐటీఐ కళాశాల
- రెండు మున్సిపాలిటీలకు రూ.25కోట్లు..పంచాయతీలకు రూ.10లక్షలు
- కుమురం భీం-ఆసిఫాబాద్ జిల్లాకు ముఖ్యమంత్రి కేసీఆర్ వరాల జల్లు
- పోడు కేసుల ఎత్తివేతపై లబ్ధిదారుల్లో ఆనందం
- బహిరంగ సభకు తండోపతండాలుగా తరలివచ్చిన జనం

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆసిఫాబాద్

ఆదివాసులు జిల్లాగా పేరొందిన కుమురం భీం-ఆసిఫాబాద్ జిల్లాకు ముఖ్యమంత్రి కేసీఆర్ వరాల జల్లు కురిపించారు. రాష్ట్రంలోనే తొలిసారి జిల్లా గిరిజన లబ్ధిదారులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు సంబంధించి 47వేలు పట్టాలు జారీ చేస్తున్నట్లు ప్రకటించారు. కొన్ని పత్రాలను లబ్ధిదారులకు స్వయంగా అందజేశారు. వారం రోజుల్లో మంత్రి, ఎమ్మెల్యేల ద్వారా పూర్తిస్థాయిలో పంపిణీ చేస్తామని భరోసా ఇచ్చారు. శుక్రవారం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. సమీకృత కలెక్టరేట్ నిర్మాణంతో పాటు జిల్లా పోలీసు కార్యాలయం, బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం తదితర వాటిని ప్రారంభించారు. అనంతరం స్థానిక ప్రేమల గార్డెన్ సమీపంలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లాకు పలు హామీలు ఇచ్చారు.ఇది వరకు ఉమ్మడి జిల్లా ఉన్న సమయంలో బెజ్జూరు నుంచి ఆదిలాబాద్‌కు వెళ్లేందుకు జిల్లావాసులు అనేక ఇబ్బందులు పడ్డారని ఆసిఫాబాద్ జిల్లా ఆవిర్భావంతో ఆ సమస్య తప్పిందని గుర్తుచేశారు. కౌటాల నుంచి మహారాష్ట్రకు వెళ్లేందుకు వార్ధా నదిపై బ్యారేజీతో పాటు రూ.75కోట్లతో వంతెన నిర్మిస్తామని..ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ఎమ్మెల్యే కోనేరు కోనప్పకు అందజేయడంతో జిల్లావాసుల్లో ఆనందం వ్యక్తమైంది. మరోపక్క ఇన్నాండ్లు పోడు భూములకోసం పోరాటం చేసిన వారిపై నమోదైన కేసులను కూడా ఎత్తివేస్తామని హామీనివ్వడంతో గిరిజనులు సంతోషం వ్యక్తం చేశారు. పోడు పట్టాలు ఇచ్చిన వారిపై వారిపై కేసులు ఉంటే బాగుండదని వ్యాఖ్యానించారు. ఉద్యమకాలంలో ఈ ప్రాంతంలో పర్యటించిన విషయాలను గుర్తుచేసుకున్నారు. ఉద్యమంలో జిల్లా పాత్ర ఎనలేనిదని..తెలంగాణరాష్ట్రం ఆవిర్భవించగానే కుమురంభీం జిల్లా ఏర్పడిందని వివరించారు.



కాగజ్‌నగర్‌కు ఐటీఐ కళాశాల

జిల్లాలో ఏదైనా కళాశాల ఏర్పాటుచేయాలని కోనప్ప కోరిక మేరకు కాగజ్‌నగర్‌లో ఐటీఐ కళాశాల మంజూరుచేస్తున్నామని ప్రకటించారు. మరోపక్క ఆసిఫాబాద్ జిల్లాలోని 335 గ్రామ పంచాయతీలకు ఒక్కోదానికి రూ.10లక్షల చొప్పున, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపాలిటీలకు రూ.25కోట్ల చొప్పున మంజూరుచేస్తున్నామని హామీనివ్వడంతో సభికులు చప్పట్లతో హర్షం వ్యక్తం చేశారు. ఈ నిధులను సర్పంచ్‌లు, ఎంపీపీలు, జిల్లా పరిషత్‌లు వినియోగించుకోవాలని సూచించారు. సిర్పూర్‌లోని నాగమ్మ చెరువును బ్రహ్మాండమైన పర్యాటక కేంద్రంగా మారుస్తామని వ్యాఖ్యానించారు. ఇదే మాదిరి మంచిర్యాల జిల్లా ప్రజాప్రతినిధుల కోరిక మేరకు ఆ జిల్లాకు సైతం నిధులు మంజూరుచేశారు. అక్కడ 311పంచాయతీలకు రూ.10లక్షలు, ఏడు మున్సిపాలిటీలకు రూ.25కోట్ల చొప్పున మంజూరుకు భరోసా ఇవ్వడంతో ఆ జిల్లాకు ప్రజాప్రతినిధులు, ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.





తండోపతండాలుగా తరలివచ్చిన జనం

ముఖ్యమంత్రి సభకు జిల్లా నలుమూలల నుంచి భారీగా జనం హాజరుకావడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. రెండు నియోజకవర్గాలు కలిగిన జిల్లా నుంచి వేలాది మంది జనం తరలిరావడంతో ముఖ్యమంత్రి సైతం అభినందనలు తెలిపారు. బస్సులు, ప్రయివేటు వాహనాల్లో భారీగా జనం రావడంతో ఆసిఫాబాద్ పట్టణం జనసంద్రమైంది. బస్టాండ్ నుంచి సభాస్థలి వరకు వెళ్లే ప్రధాన రోడ్డు మార్గం జనంతో కిక్కిరిసిపోయింది. పోలీసులు ట్రాఫిక్‌ను పునరుద్ధరిస్తూ పరిస్థితులను చక్కదిద్దారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో హోంమంత్రి మహమూద్‌అలీ, మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్,జడ్పీ ఛైర్మెన్లు కోవలక్ష్మీ, రాథోడ్ జనార్ధన్, ఎమ్మెల్యేలు కోనేరుకోనప్ప, ఆత్రం సక్కు, దుర్గం చిన్నయ్య,దివాకర్‌రావు, జోగురామన్న, రేఖానాయక్, విఠల్‌రెడ్డి,రాథోడ్ బాపురావు, ఎమ్మెల్సీ దండె విఠల్, మాజీ ఎమ్మెల్సీ పురానం సతీష్, మాజీ ఎంపీ గోడం నగేష్, గ్రంథాలయ ఛైర్మెన్ కనక యాదవరావు, జడ్పీ వైస్ ఛైర్మెన్ కోనేరు కృష్ణారావు, జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, మార్కెట్ కమిటీ ఛైర్మెన్లు మల్లేష్, కాసం శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరయ్యారు.

పోలీస్ బెటాలియన్‌లో సుందరీకరణ పనులు ప్రారంభిస్తాం



నవతెలంగాణ-అదిలాబాద్‌రూరల్

మండలంలోని యాపల్‌గూడలోని పోలీస్ బెటాలియన్‌లో అవసరమైన సుందరీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేసేలా తగు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ పేర్కొన్నారు. ఇటీవల బెటాలియన్‌లో జరిగిన ఓ కార్యక్రమానికి ఎమ్మెల్యే జోగురామన్న హాజరై అభివృద్ధి పనుల విషయమై హామీ ఇవ్వగా శుక్రవారం బెటాలియన్‌ను సందర్శించి స్థానిక అధికారులతో వివిధ అంశాలపై చర్చించారు. పోలీస్ అధికారులు, సిబ్బందికి ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా చేపట్టవలసిన అభివృద్ధి పనులతో సహా సుందరీకరణకు సంబంధించిన అంశాలపై చర్చించారు. త్వరలోనే పనులు ప్రారంభించి నిర్దేశిత సమయంలో పూర్తి చేసేలా అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ మేరకు మున్సిపల్ ఛైర్మన్ జోగు ప్రేమేందర్ మాట్లాడుతూ బెటాలియన్‌లో చేపట్టవలసిన పనుల విషయాన్ని ఇటీవల ఎమ్మెల్యే జోగు రామన్న దృష్టికి తీసుకురాగా వాటిని పూర్తి చేసేందుకు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. త్వరలోనే పనులకు సంబంధించిన ప్రతిపాదనలు పంపి టెండర్ ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ గండ్రత్ రమేష్, సర్పంచ్ పెందూర్ గంగారాం, నాయకులు కుమ్ర రాజు, ఆరే నరేష్, అరుణ్, బెటాలియన్ ఆఫీసర్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన కార్మికుడికి సన్మానం



నవతెలంగాణ - రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీలో కన్వేయర్ ఆపరేటర్‌గా పనిచేస్తూ పదవి విరమణ పొందుతున్న చంద్రి పెంటయ్యను డీవై జీఎం జాడె భీంరావు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రి పెంటయ్య శేష జీవితం ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఖైరిగూడ ఓసీలో పదవి విరమణ పొందిన కార్మికులు గోపాల్, ప్రభాకర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాజు(ఈఅండ్ఈ), ఫిట్ సెక్రటరీ నేరుగు రమేష్, ఏరియా ప్రతినిధి సంపత్, ఆఫీస్ ఇన్‌చార్జి మాన్కు సమ్మయ్య, ఖైరిగూడ ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి జూపాక రాజేష్, ఏఐటీయూసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి అబ్దుల్ రెహమాన్, మారం శ్రీనివాస్, కిరణ్, నాయకులు కృష్ణమోహన్, రాజు, ఇట్యాల పోశం, అల్లాడి గోపి, కోడూరి రమేష్, ధర్మయ్య బ్రహ్మం, రామ్మూర్తి, గోపాల్, తోటి కార్మికులు, ఉద్యోగులు, అధికారులు పాల్గొన్నారు.

నిరుపేదలకు మూడెకరాల సాగు భూమి ఇవ్వాలి

నవతెలంగాణ-జన్నారం

భూమిలేని నిరుపేదలకు మూడెకరాల భూమి ఇవ్వాలని గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నేతావత్ రామదాసు నాయక్, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు దారింగుల ఎల్లయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భూమిలేని నిరుపేదలతో మండల తహసీల్దార్ కిషన్‌కు గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు దున్నే వారికే సాగు భూమి ఇవ్వాలన్నారు. ప్రతి ఎస్సీ, ఎస్టీ బీసీలకు మూడెకరాల భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ వస్తే ప్రతి ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు దళితులకు మూడు ఎకరాల భూమి ఇస్తానని, ఇవ్వకుండా కేసీఆర్ మోసం చేశాడన్నారు. ప్రతి పేదవానికి మూడు ఎకరాల సాగుభూమి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేని ఎడల గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

కాంగ్రెస్‌లోకి డాక్టర్ రాజా రమేష్

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

జులై2వ తేదీన ఖమ్మంలో నిర్వహించే రాహుల్ గాంధీ బహిరంగ సభలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు డాక్టర్ రాజా రమేష్ తెలిపారు. శుక్రవారం ఆయన స్వగృహంలో చెన్నూర్ నియోజవకవర్గ కాంగ్రెస్ ముఖ్య నాయకుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మం బహిరంగ సభకు చెన్నూరు నియోజక వర్గం నుంచి భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ అభిమానులు పాల్గొనాలని కోరారు. ఈ విషయంలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డితో చర్చలు జరిపి కార్యాచరణ తెలియజేస్తానని తెలిపారు. అలాగే చెన్నూర్ నియోజక వర్గంలో కాంగ్రెస్ బహిరంగ సభ ఏర్పాటు చేసి, రాష్ట్ర ముఖ్య నేతల ఆధ్వర్యంలో భారీ చేరికలు ఉంటాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ నియోజక వర్గ ముఖ్య నాయకులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సాదాసీదాగా కొనసాగిన మున్సిపల్ సమావేశం


నవతెలంగాణ-నస్పూర్

నస్పూర్ మున్సిపాలిటీలో శుక్రవారం మున్సిపల్ సమావేశంలో మున్సిపల్ ఛైర్మన్ ఈసాంపల్లి ప్రభాకర్ అధ్యక్షతన సాదాసీదా కొనసాగింది. సమావేశంలో ప్రవేశపెట్టిన 33 అంశాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ తోట శ్రీనివాస్, కమిషనర్ తన్నీరు రమేష్ పాల్గొన్నారు.

నేడు గ్రూప్-4 పరీక్ష..ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రశాంత వాతావరణంలో గ్రూప్-4 పరీక్షలు నిర్వహించేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ రాహుల్ రాజ్ పిఎస్ అన్నారు. శుక్రవారం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-4 పరీక్షల నిర్వహణపై హైదరాబాద్ నుండి టీఎస్పీఎస్సీ చైర్మన్ జనార్ధన్‌రెడ్డి, సభ్యులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జూలై 1 శనివారం నిర్వహించే గ్రూప్-4 పరీక్షల నిర్వహణ తీసుకోవలసిన జాగ్రత్తలు తదితర అంశాలపై కలెక్టర్లకు ఆయన దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్రూప్-4 పరీక్షల నిర్వహణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికే ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందని, సమావేశాలు నిర్వహించి తీసుకోవలసిన చర్యలపై వారికి ఆదేశాలు జారీ చేశామన్నారు. జిల్లాలో 54 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, 17771 మంది అభ్యర్థులు పరీక్షా రాయనున్నారని తెలిపారు. చీఫ్ సూపరిండెంట్లు, లైజన్ అధికారులు, ఇన్విజిలేటర్లకు శిక్షణలు ఇవ్వడం జరిగిందన్నారు. పరీక్షా కేంద్రాలలో సీసీ కెమెరాలు, తాగునీరు, వైద్య, భద్రత తదితర అంశాలు ప్రభుత్వ నియమ నిబంధన ప్రకారం పాటించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఉట్నూర్, ఇచ్చోడ, బోథ్ కేంద్రాల అభ్యర్థులకు ఉదయం ఆర్టీసీ ద్వారా ప్రత్యేక బస్‌లను నడపనుందని తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల సందేహాల నివృత్తికి ప్రత్యేక హెల్ప్‌లైన్ నెంబర్‌ను కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. టెలీ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ఎన్.నటరాజ్, కలెక్టరేట్ పర్యవేక్షకులు రాంరెడ్డి పాల్గొన్నారు.



నిర్మల్ : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-4 పరీక్ష కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని అదనపు కలెక్టర్ పి.రాంబాబు అన్నారు. శనివారం తన ఛాంబర్‌లో మాట్లాడుతూ నిర్మల్‌లో 31, ఖానాపూర్‌లో 6, భైంసాలో 17 కేంద్రాల చొప్పున మొత్తం 54 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ పరీక్షకు మొత్తం 15,474 మంది అభ్యర్థులు హాజరవుతారని తెలిపారు. పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయని, మొదటి పేపర్ ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12:30 వరకు జనరల్ స్టడీస్ పేపర్, రెండవ పేపర్ మధ్యాహ్నం 2:30 నుండి సాయంత్రం 5 గంటల వరకు సెక్రటేరియట్ ఎబిలిటీ పరీక్ష నిర్వహించబడుతుందని తెలిపారు. అభ్యర్థులు పరీక్ష సమయానికి గంట ముందుగానే సెంటర్లకు చేరుకోవాలని తెలియజేశారు. ప్రతి పరీక్ష ప్రారంభానికి 15 నిమిషాల ముందు పరీక్ష కేంద్రం గేట్లు మూసివేస్తారని, ఆ తర్వాత వచ్చిన అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించరని తెలిపారు. పరీక్షలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరుగుతాయని, సాంకేతిక పరమైన సమస్యలు రాకుండా టెక్నికల్ డిపార్ట్మెంట్‌కు బాధ్యతలు అప్పగించామని పేర్కొన్నారు. ఒకరికి బదులుగా మరొకరు పరీక్ష రాయకుండా ఉండేందుకు అభ్యర్థుల గుర్తింపు కోసం ఎడమ చేతి వేలిముద్ర తీసుకుంటారని తెలిపారు. అభ్యర్థులు చేతులకు గోరింటాకు పెట్టుకుంటే వేలిముద్రలు పడే అవకాశం తక్కువ ఉంటుందని, అభ్యర్థులు ఎవరూ కూడా చేతులకు గోరింటాకు పెట్టుకోకూడదని తెలియజేశారు.

వర్షాకాలంలో చర్మ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు..!

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



వర్షాకాలంలో తేమ స్థాయిలు పెరగడంతో, అనేక చర్మ వ్యాధులు, ఇన్ఫెక్షన్లు వస్తాయి. వేడాది పొడవునా ఆరోగ్యకరమైన చర్మానికి కొన్ని సాధారణ జాగ్రత్తలు తీసుకోవాలని ఆదిలాబాద్ స్కిన్ కేర్ వైద్యురాలు సిరిశ్రీ తెలిపారు. డాక్టర్స్ డే ను పురస్కరించుకుని ముందుగా అందరికీ డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు పలు సలహా సూచనలు చేశారు. వాతావరణంలో తేమ పెరిగినప్పుడు చర్మంపై దద్దుర్లు, అలెర్జీలకు ఆస్కారం ఉంటుంది. అందువల్ల ఈ వర్షాకాలంలో చర్మ సంరక్షణను సీరియస్‌గా తీసుకోవడం చాలా ముఖ్యం. ఇది దురదకు దారితీసే శరీరంలో అధిక నూనె స్రావాన్ని ప్రేరేపిస్తుంది. కాబట్టి, చర్మం, జుట్టు సంబంధిత సమస్యలు చాలా సాధారణం. మన ఇండ్లలో, చుట్టుపక్కల నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. నీరు నిల్వ ఉండడంతో క్రిమి కీటకాలు ఏర్పడతాయి. వీటి ద్వారా చర్మంపై దాడి చేస్తాయి. దాంతో వ్యాధులు సంభవిస్తాయి. అలాగే వర్షాకాలం తడిసినప్పుడు తడి బట్టలు వేసుకోవడం వలన చర్మ వ్యాధులు సభవించవచ్చు. లో దుస్తులు తడిగా ఉండకుండా వేసుకోవాలి. లేకుంటే ఇన్ఫెక్షన్ వచ్చే అవకాశాలుంటాయి. వర్షాకాలంలో చలిగా ఉందని వేడినీటితో స్నానం చేయకూడదు. గోరు వెచ్చని నీటితో స్నానం చేయాలి. వ్యవసాయదారులు ప్రతిరోజు తమ వ్యవసాయ పనులు ముగించక కాళ్లు, చేతులు పరిశుభ్రంగా కడుక్కోవాలి. లేకుంటే దురద వచ్చే అవకాశం ఉంది. చర్మ వ్యాధులకు సంబంధించిన ఏ వ్యాధి వచ్చిన ముందుగా దురద రావడం సహజం. అయితే దురద తగ్గడం కోసం మెడికల్ షాప్ నుండి క్రీములు తెచ్చుకొని వాడడం చేస్తుంటారు. అలా చేయడం వలన సైడ్ ఎఫెక్ట్స్ వచ్చే అవకాశం ఉంది. చర్మానికి ఏ సమస్య వచ్చినా ముందుగా డాక్టర్‌ను సంప్రదించి వారిచ్చే మందులను సలహా సూచనలు వాడాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరి. చర్మాన్ని ఎల్లవేళలా పొడిగా ఉంచాలి. స్నానం చేసేటప్పుడు అన్ని చర్మపు మడతలను సబ్బుతో శుభ్రం చేయాలి. స్నానం చేసిన తర్వాత, అన్ని చర్మపు మడతలను పూర్తిగా ఆరబెట్టాలి. ముఖ్యంగా వదులుగా, కాటన్ దుస్తులను మాత్రమే ధరించాలి. చెమటకు టవల్ లేదా టిష్యు పేపర్‌ని ఉపయోగించాలి. జిమ్ లేదా వర్కౌట్ సెషన్ తర్వాత, స్నానం చేసి, పూర్తిగా శుభ్రం చేసుకోవాలి. శిశువులో డైపర్ ప్రాంతాన్ని శుభ్రంగా ఉంచాలి. తరచుగా డైపర్ మార్చాలి.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు

- జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దేవేందర్‌రెడ్డి

నవతెలంగాణ-నిర్మల్

జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలను రోగులకు అందిస్తున్నామని, జిల్లా ఆస్పత్రుల సూపరింటెండెంట్ డాక్టర్ దేవేందర్ అన్నారు. జిల్లాలో ఆయా ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుతున్న వైద్య సేవలపై డాక్టర్స్ డే సందర్భంగా నవతెలంగాణతో మాట్లాడారు. ప్రయివేటు, ఆస్పత్రులైన సూపర్, మల్టీ స్పెషల్ ఆస్పత్రుల స్థాయిలో నాణ్యమైన సేవలను తాము అందిస్తున్నామని తెలిపారు. అలాగే అత్యవసర పరిస్థితుల్లో రోగులు చికిత్సల కోసం దూర ప్రాంతాలకు వెళ్లకుండా, స్థానికంగానే అన్ని రకాల వైద్య సేవలను ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే రోగులకు అందిస్తున్నామని తెలిపారు. మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సహకారంతో ఇటీవల రూ.166 కోట్లతో నిర్మల్ జిల్లాకు తెలంగాణ వైద్యారోగ్య శాఖ ఉత్తర్వుల ద్వారా మెడికల్ కాలేజీ మంజూరైందని తెలిపారు. జిల్లా ఆస్పత్రులను అన్ని హంగులతో తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. పాలియేటివ్ కేర్ యూనిట్, కొత్తగా రేడియాలజీ ల్యాబ్ కోసం రూ.75 లక్షలు మంజూరయ్యాని తెలిపారు. రిలయన్స్ సంస్థ సహకారంతో నూతనంగా సీటీ స్కాన్ సౌకర్యం అందుబాటులోకి వచ్చామని పేర్కొన్నారు. మార్చురీ ఆధునీకరణ కోసం రూ. 20 లక్షలు మంజూరు అయి సివిల్ పనులు జరుగుతున్నాయని తెలిపారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ముధోల్ ఆస్పత్రిని 30 పడకలుగా ఆధునీకరించుటకు రూ.8కోట్లు మంజూరు అయినవి తెలిపారు. నిర్మల్ జిల్లా ఆస్పత్రిలో కొత్తగా ఎన్‌సీడీ క్లినిక్, డెడికేటెడ్ పిడియాట్రిక్ కేర్ యూనిట్ అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. కాయాకల్ప్ కార్యక్రమంలో భాగంగా మన జిల్లా ఆస్పత్రి రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు. రూ.25 లక్షల పారితోషకం మంజూరైందని తెలిపారు. ఈ పరిణామం జిల్లాకే గర్వకారణమని ఆనందం వ్యక్తం చేశారు. హైదరాబాద్ నిర్మాణ్ సంస్థ సహాయ, సహకారాలతో రూ.30లక్షల వ్యయంతో ఆస్పత్రి సుందరీకరణ పనులు చేయడం జరిగిందని వెల్లడించారు. తెలంగాణ డయాగ్నొస్టిక్ సెంటర్ ప్రారంభించమన్నారు. దీంతో వివిధ రకాల వ్యాధుల సంబంధించి 53 రకాల పరీక్షలు చేస్తున్నామని వెల్లడించారు. జిల్లా ఆస్పత్రికి రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో సుమారుగా నిధులు రూ.2.5కోట్ల వ్యయంతో ఎఫ్‌టీపీసీఆర్ ల్యాబ్‌ను నిర్మించడం జరిగిందని తెలిపారు. నూతనంగా ఎంసీహెచ్ ఆసుపత్రి నిర్మించడానికి జిల్లా కలెక్టర్ 5 ఎకరాల భూమిని భైంసా లో కేటాయించడం జరిగిందిని తెలిపారు. ఏప్రిల్ 2022 నుండి మార్చ్ 2023 వరకు 4,962కి పైగా కేసీఆర్ కిట్లను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఏప్రిల్ 2022 నుండి మార్చ్ 2023 వరకు జిల్లాలో అన్ని వైద్య విధాన పరిషత్తుల్లో ఆరోగ్యశ్రీ ద్వారా 3,576 శస్త్రచికిత్సలు చేయడం జరిగిందన్నారు. అలాగే సుమారుగా 6,665 స్త్రీ ప్రసవాలు జరిగినవని తెలిపారు. అత్యవసర చికిత్స విభాగంలో ఏప్రిల్ 2022 నుండి మార్చ్ 2023 వరకు 1,182 మంది రోగులకు చికిత్స అందించటం జరిగినదని వెల్లడించారు. డయాలిసిస్ కేంద్రాన్ని 5 పడకల నుండి 10 పడకలుగా ఉన్నతీకరించడం జరిగిందని వెల్లడించారు. కిడ్నీ రోగుల కొరకు డయాలిసిస్ సెంటర్ ద్వారా గత సంవత్సర కాలంలో 12,916 సార్లు రక్త శుద్ధీకరణ చేయటం జరిగినదని తెలిపారు. నిర్మల్‌లో నూతనంగా డయాగ్నొస్టిక్ ల్యాబ్ సెంటర్, మెకనైజ్డ్ లాండ్రి మెషిన్లు, ఏరియా హాస్పిటల్ భైంసాలో అత్యాధునిక ఏసీ లేబర్ రూమ్, బ్లడ్ బ్యాంక్ సౌకర్యాలు ప్రారంభించడం జరిగిందని వెల్లడించారు. జిల్లాలోని అన్ని వైద్య విధాన పరిషత్ హాస్పిటల్స్‌లో బయోమెట్రిక్ విధానం, ఈ హాస్పిటల్, ఈ ఔషది ప్రారంభించామని తెలిపారు. జిల్లా హాస్పిటల్‌నకు అదనంగా పడకలను, అదేవిధంగా ఎంసీహెచ్‌నకు 100 అదనపు పడకలు కేటాయించడం జరిగినదని వెల్లడించారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వివిధ వ్యాధులతో వచ్చిన రోగులకు అత్యుత్తమ వైద్య సేవలతో పాటు, అరుదైన, క్లిష్టమైన శస్త్రచికిత్సలు చేస్తున్నాం.



పదవీ విరమణ అధికారులకు, ఉద్యోగులకు సన్మానం



నస్పూర్ : శ్రీరాంపూర్ ఏరియాలో ఏరియా ఇంజనీర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందుతున్న జి రమేష్‌బాబును శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి జనరల్ మేనేజర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ ఇంజనీర్‌గా ఆయన చేసిన సేవలను కొనియాడారు. పదవీ విరమణ అనంతరం ఆయన శేష జీవితం ఆయురారోగ్యాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. అలాగే శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-న్యూటెక్ గనిలో పని చేస్తూ పదవీ విరమణ పొందిన కుమారస్వామి(ఫిట్టర్), శంకరయ్య(జనరల్ మద్దూర్)ని గని ఎస్ఓం ఇ.స్వామిరాజు, ఆర్కే-7 గనిలో పదవీ విరమణ పొందిన దాసరి రాంచందర్(సీనియర్ మైనింగ్ సర్దార్), పెద్దపల్లి బాపు (ట్రామర్), మదిరే రాములు(హాలర్ ఆపరేటర్), సిరిశెట్టి రాజయ్య కోల్ కట్టర్)ను గని మేనేజర్ సాయిప్రసాద్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉద్యోగులు కంపెనీకి చేసిన సేవలను కొనియాడారు. ఉద్యోగ విరమణ తదుపరి జీవితాన్ని కుటుంబ సభ్యులతో సుఖ సంతోషాలతో గడపాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీజీఎంలు, అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

కుమురం భీం విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-సిరికొండ

కుమురం భీం విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తుడుం దెబ్బ కమిటీ జిల్లా అధ్యక్షుడు గోడం గణేష్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆదివాసులతో కలిసి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆదివాసీల హక్కుల కోసం జల్, జంగల్, జమీన్ అనే నినాదంతో పోరాటం చేసిన గొప్ప మహనీయుడని కొనియాడారు. జులై 10న జిల్లా కేంద్రంలో కుమురం భీమ్ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం ఉంటుందని, మండలంలోని ఆదివాసులంతా తరలివచ్చి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అమృత్ రావ్, తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు యాదవ్ రావ్, కన్నపూర్ సర్పంచ్ రఘురాం, రిమ్మ సార్మేడి అమృత్‌రావ్ పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

మెరుగైన వైద్యం అందించాలి

నవతెలంగాణ-నార్నూర్

ప్రభుత్వాస్పత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందికి డాక్టర్ రామ్‌బాబు సూచించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో శుక్రవారం అన్ని సబ్ సెంటర్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఏఎన్‌ఎంలతో కలిసి సమావేశం నిర్వహించారు. ప్రజలకు ఇచ్చే వైద్య సేవలు, గర్భిణీ బాలింతలు చిన్న పిల్లలకు టీకాలు, డెలివరీ, టీబీ కేసులు లేప్రసీ కేసులు దీర్ఘకాలిక వ్యాధుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోగుల రోజు వారి వివరాల నిర్వహణ సక్రమంగా ఉండాలని ఆదేశించారు. సమావేశంలో హెచ్ఈఓ నాందేవ్, హెల్త్ సూపర్‌వైజర్‌లు చౌహన్ చరణ్‌దాస్, సతవ్వ, సిబ్బంది రవీందర్ ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.



వికలాంగులకు సామాజిక భద్రత కల్పించాలి

- వికలాంగుల హక్కుల జాతీయ వేదిక తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ఎం.అడివయ్య
- జులై 10న ఛలో ఢిల్లీ



నవతెలంగాణ-నిర్మల్

వికలాంగులకు సామాజిక భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ జులై 10న జరిగే ఛలో ఢిల్లీ, జంతర్ మంతర్ వద్ద జరిగే వికలాంగుల మహాధర్నను జయప్రదం చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ఎం.అడివయ్య, జిల్లా అధ్యక్షులు ఎండీ. ఫసియోద్దిన్ అన్నారు. శుక్రవారం వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం ప్రజాసంఘాల కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. దేశంలో వికలాంగులకు రక్షణ లేకుండా పోతోందని అన్నారు. మహిళా వికలాంగులు, బాలికలు, మూగ, చెవిటి, మానసిక మహిళా వికలాంగులపై లైంగిక వేదింపులు, అత్యాచారాలు జరుగుతున్నాయని అన్నారు. వీటన్నింటినీ అరికట్టి వికలాంగులకు వారి కుటుంబ సభ్యులకు భరోసా కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని అన్నారు. వికలాంగుల భద్రత కోసం ప్రత్యేక చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరా గాంధీ జాతీయ వికలాంగుల పెన్షన్ ధరల పెరుగుదలకు అనుగుణంగా రూ.10 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. 40శాతం వైకల్యం కలిగిన వికలాంగులకు పెన్షన్ మంజూరు చేయాలని అన్నారు. వికలాంగుల కుటుంబాలకు అంత్యోదయ కార్డులు పంపిణీ చేయాలని అన్నారు. వికలాంగుల నిత్య జీవిత అవసరాలు తీర్చడానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు.. నిరుద్యోగ వికలాంగులకు స్వయం ఉపాధి కల్పించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నామినేటెడ్ పదవుల్లో వికలాంగులకు రిజర్వేషన్స్ అమలు చేయాలని అన్నారు. 21రకాల వైకల్యాలకు సర్టిఫికేట్స్ జారీ చేయాలని అన్నారు. రైల్వేతో పాటు అన్ని రకాల ప్రయాణాల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని అన్నారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేలో వికలాంగుల వివరాలు నమోదు చేయాల్సిన అవసరం లేదని, కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం సిగ్గుచేటని అన్నారు. అన్ని రంగాలపై కేంద్ర ప్రభుత్వం దాడి చేస్తున్నట్లే వికలాంగుల హక్కులపై కూడా దాడి చేస్తుందని మండిపడ్డారు. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం పటిష్టంగా అమలు చేయాలని అన్నారు. సామూహిక ప్రాంతాలన్నీ అవరోధ రహితంగా మార్చాలనే నిర్ణయాన్ని పూర్తి చేయాలనీ డిమాండ్ చేశారు. ఛలో ఢిల్లీ కార్యక్రమం జయప్రదం కోసం జులై 9వరకు రాష్ట్ర వ్యాప్తతంగా గ్రామాలలో కరపత్రాలు, పోస్టర్స్ ద్వారా విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఛలో ఢిల్లీకి 33 జిల్లాల నుంచి 2వేల మంది వికలాంగులు హాజరు అవుతున్నారని తెలిపారు. హక్కుల సాధన కోసం ఢిల్లీలో జులై 10న జరుగుతున్న మహాధర్నాను జయప్రదం చేయాలని కోరారు.

నూతన జిల్లా కమిటీ ఎన్నిక..

వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నిర్మల్ జిల్లా నూతన అధ్యక్షులుగా ఎండీ ఫసియోద్దిన్, గౌరవ అధ్యక్షులుగా తొడసం శంభు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు లక్ష్మి, నాగరాజు, పోశెట్టి, కమల, మల్లు పాల్గొన్నారు.

వైద్య వృత్తిలో పేదలకు సేవలు అందిస్తూ..

నవతెలంగాణ-భైంసా

సమాజంలో వైద్య వృత్తి ఎంతో గౌరవప్రదమైనది. దశాబ్ద క్రితం భైంసా లో ఒకరిద్దరు డాక్టర్లు ఉండేవారు. దీంతో మెరుగైన సేవలు కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. గత పది సంవత్సరాల నుండి భైంసాలో ఆస్పత్రులు పెరగడం, అదేవిధంగా ఏరియా ఆస్పత్రిలో సౌకర్యాలు కల్పించడంతో ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయి. అక్కడ అందుతున్న వైద్య సేవలపై డాక్టర్స్ డే సందర్భంగా నవతెలంగాణతో మాట్లాడారు.

చిన్ననాటి నుండి డాక్టర్ కావాలనుకున్నా..

డాక్టర్ పద్మావతి గైనకాలజిస్ట్ భైంసా



చిన్ననాటి నుండే తాను డాక్టర్ కావాలనుకున్నానని వైద్యురాలిగా ప్రజలకు సేవ చేయడం ఎంతో ఆనందంగా ఉంది. గత ఎనిమిది సంవత్సరాలుగా ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో వైద్యమందిస్తున్నాను. అందరితో కలివిడిగా ఉంటూ పేదలకు మెరుగైన సేవలు అందిస్తూ పేదల డాక్టర్‌గా పేరు తెచ్చుకున్నాను. తెలంగాణ దశాబ్ద ఉత్సవాల్లో ఉత్తమ అవార్డులను అందుకున్నాను. కరోనా సమయంలో గర్భిణీలకు వైద్య సేవలు చేసి అందరి మన్ననలు పొందాను

13 సంవత్సరాలుగా ఏరియా ఆస్పత్రిలో వైద్య సేవలు

డాక్టర్ సురేందర్ భైంసా



భైంసా ఏరియా ఆస్పత్రిలో గత 13 సంవత్సరాలుగా జనరల్ సర్జన్‌గా ఎన్నో సర్జరీలు చేస్తూ రోగులకు సేవలందిస్తున్నాను. గతంలో ఆపరేషన్ల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. ఏరియా ఆస్పత్రిలో వేలాది ఆపరేషన్లు చేసి పేద ప్రజల ప్రాణాలు కాపాడగలుగుతున్నాం. ఒకే రోజు వివిధ రకాల 18 ఆపరేషన్లు చేసి రికార్డు సాధించాను. సేవలను గుర్తించిన ప్రభుత్వం పలుమార్లు ఉత్తమ అవార్డులను అందజేసింది. ప్రజలకు సేవ చేయడం ఎంతో ఆనందంగా ఉంది.

23 సంవత్సరాలుగా ఏరియా ఆస్పత్రిలో సేవలు



ఏరియా ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ కాశీనాథ్

గత 23 సంవత్సరాలుగా భైంసా ఏరియా హాస్పిటల్‌లో విధులు నిర్వర్తిస్తూ తనకంటూ ప్రత్యేకమైన పేరు సంపాదించుకున్నానని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కాశీనాథ్ తెలిపారు. డాక్టర్స్ డే సందర్భంగా నవతెలంగాణతో ఆయన మాట్లాడారు. ఆస్పత్రికి వచ్చే గర్భిణులకు ఒప్పిగా సమాదానం చేప్త స్కానింగ్ చేసి వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎప్పటికప్పుడు తెలియజేసేవాన్ని. ఆస్పత్రి అభివృద్ధికి కృషి చేసి అన్ని మౌలిక వసతుల కల్పనకు కృషి చేశాను. తోటి డాక్టర్లను సమన్వయం చేస్తు ఆస్పత్రి అభివృద్ధికి తోడ్పాటును అందిస్తున్నాం.

పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ద వహించాలి...

పిల్లల వైద్యనిపుణులు డాక్టర్ అనిల్ జాదవ్



వర్షాకాలంలో పిల్లల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని డాక్టర్ అనిల్ జాదవ్ అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా నవతెలంగాణతో ఆయన మాట్లాడారు. ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తూ తండ్రి లేని ఆడ పిల్లలకు ఉచిత వైద్యంతో పాటు విద్యనందిస్తున్నా. నేను చేసిన సేవలకు ప్రభుత్వం గుర్తించి, అవార్డులు సైతం అందజేసింది. ప్రజలకు సేవ చేయడం ఆనందంగా ఉంది.

ప్రతి గురువారం ఉచిత సేవలు

డాక్టర్ విజయానంద్ జాదవ్



చిన్నారులకు ప్రతి గురువారం ఉచిత సేవలు అందిస్తున్నారు. డాక్టర్ విజయానంద్. పిల్లల వైద్యనిపుణులుగా గత 12 సంవత్సరాలుగా ఏరియా ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వం తరపున పలుమార్లు ఉత్తమ అవార్డులను దక్కించుకున్నారు. చిన్నారులకు వైద్య సేవలు చేయడం ఎంతో సంతృప్తిని ఇస్తుందన్నారు. ప్రజలకు సేవలు అందిస్తూ పేదల డాక్టర్‌గా పేరు తెచ్చుకున్నారు.

ప్రయివేటు పాఠశాల దోపిడీని అరికట్టాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రయివేటు పాఠశాలలో అవినీతి రాజ్యమేలుతోందని, పాఠశాలల యాజమాన్యాల దోపిడీని అరికట్టాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ రాష్ట్ర ఆర్గనైజ్ సెక్రటరీ కొట్టూరి ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో విద్యారంగ సమస్యలను పరిష్కరించాలంటూ శుక్రవారం ర్యాలీ చేపట్టారు. పట్టణ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించి, డీఈఓ ప్రణీతకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ మేరకు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ పలు పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తున్నారని, అలాగే యూనిఫామ్స్, బుక్స్ బుట్లు, పాఠశాలలోనే దుకాణాలు తెరిచి బహిరంగంగానే అమ్ముతున్నారని ఆరోపించారు. వేలాది రూపాయలు తల్లిదండ్రుల నుండి ముక్కుపిండి వసూలు చేస్తున్నారన్నారు. ఈ తతంగమంతా తెలిసినప్పటికీ ఉన్నత విద్యాధికారులు చూసి చూడనట్టు ఉంటున్నారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ కన్వీనర్ గొర్ల నరేందర్ యాదవ్, కో కన్వీనర్ ఉల్లెంగుల సతీష్, అదిలాబాద్ పట్టణ, వివిధ మండలాల కన్వీనర్లు పాల్గొన్నారు.

అధికారిక ఫేస్‌బుక్ అకౌంట్‌ను ప్రారంభించిన కలెక్టర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్నికలు-2023 దృష్ట్యా అధికారిక ఫేస్ బుక్ అకౌంట్ కలెక్టర్ఏడీబీఏడీబీ ను జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధికారిక ఫేస్ బుక్ అకౌంట్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలంద ప్రియ, ఈడీఎం రవి పాల్గొన్నారు.

ప్రొవిజినల్ జాబితాను సరి చూసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇటీవల విడుదల చేసిన జిల్లా మిషన్ కోఆర్డినేటర్-(1), జెండర్ స్పెషలిస్ట్-(02), స్పెషలిస్ట్ ఇన్ ఫైనాన్షియల్ లిటరసీ-(2) పోస్టులకు సంబంధించిన ప్రొవిజినల్ లిస్టును, ఎంటిఎస్-(1) డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఆదిలాబాద్.ఎన్ఐసీ.ఇన్

డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఆదిలాబాద్.తెలంగాణ.గావ్.ఇన్ వెబ్ సైట్‌లో పొందుపరచడం జరిగిందని జిల్లా సంక్షేమ, మహిళా శిశు వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారిణి మిల్కా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ అభ్యంతరాలను జులై 5లోపు ఆదిలాబాద్‌లోని శాఖ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

అభ్యర్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా పరిధిలోని చైల్డ్ హెల్ప్ లైన్‌లో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేయుటకు ఆసక్తిగల అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేసు వర్కర్ (03) పోస్టులకు గాను వివరములు విద్యార్హతలు, దరఖాస్తు ఫారం నమనాల కొరకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఆదిలాబాద్.ఎన్ఐసీ.ఇన్

డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఆదిలాబాద్.తెలంగాణ.గావ్.ఇన్ వెబ్ సైట్‌ను చూడాలని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ అన్ని విద్యార్హతలు చిరునామాతో కూడిన రెజ్యూమ్ జులై 7లోగా జిల్లా శిశుసంక్షేమ అధికారిణి, మహిళా వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆదిలాబాద్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

సామాజిక తనిఖీ ప్రజా వేదికను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-సిరికొండ

సామాజిక తనిఖీ ప్రజావేదికను విజయవంతం చేయాలని ఎంపీడీఓ సురేష్ కోరారు. మండలంలోని 19 గ్రామ పంచాయతీలలో రెండో విడతలో భాగంగా ఆయా గ్రామాల్లో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ బృందాలు తనిఖీ నిర్వహించి, తమ నివేదికలను సమర్పించడానికి, ఈ నెల మూడో తేదీన ఉదయం 10 గంటలకు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజా వేదికను నిర్వహిస్తున్నామని తెలిపారు.

గ్రూప్-4 పరీక్షకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జులై 1న శనివారం ఆదిలాబాద్ జిల్లాలో నిర్వహించే గ్రూప్-4 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల కోసం ఆర్టీసీ సంస్థ ప్రత్యేక బస్సులు నడిపిస్తుందని డిపో మేనేజర్ కే.కల్పన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా జరిగే ఈ పరీక్షల సమయానికి అనుకూలంగా సర్వీసులను అందుబాటులో ఉంచుతామని, ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేరాల నియంత్రణే లక్ష్యంగా కార్డెన్ సెర్చ్

- డీఎస్పీ నారాయణ నాయక్

నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్

సమాజంలో జరుగుతున్న నేరాల నియంత్రణే లక్ష్యంగా కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహిస్తున్నట్టు డీఎస్పీ నారాయణ నాయక్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీలో కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహించామని ఎలాంటి ధృవపత్రాలు లేని 40 ద్విచక్ర వాహనాలు, 6 ఆటో రిక్షాలు స్వాధీనపర్చుకున్నట్టు తెలిపారు. పట్టణంలో కానీ, పరిసర ప్రాంతంలో కానీ ఎలాంటి గుర్తు తెలియని వ్యక్తులు కనిపించిన, అనుమానితులు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. నేరాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన ప్రజలను కోరారు. ఈ కార్డెన్ అండ్ సెర్చ్‌లో సర్కిల్ పరిధిలోని ఎస్సైలు శంకర్, రాజులతో పాటు 60 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నట్టు తెలిపారు.



సీఆర్టీ ఉద్యోగాలను ఆదివాసీ నిరుద్యోగ యువతతో భర్తీ చేయాలి

- తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు గోడం గణేష్



నవతెలంగాణ-ఉట్నూర్

ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలల్లో ఖాళీలగా ఉన్న సీఆర్టీ ఉద్యోగాలను భర్తీలలో ఆదివాసీ నిరుద్యోగ యువతీ, యువకులచే భర్తీ చేయాలని తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు గోడం గణేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి పుర్క బాపురావు, మహిళ జిల్లా ప్రధాన కార్యదర్శి పెందుర్ పుష్పరాణి డిమాండ్ చేశారు. శుక్రవారం తుడుందెబ్బ ఆధ్వర్యంలో స్థానిక కేబి కాంప్లెక్స్‌లోని కుమురం భీం విగ్రహం వద్ద నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనుల కోసం ప్రత్యేక ఐటీడీఏను ఏర్పాటు చేశారని అన్నారు. అన్నింటిలో ఆదివాసులు అభివృద్ధిలో వెనుకబడి ఉన్నారన్నారు. ఆదివాసీ నిరుద్యోగులు చాలా మంది డీఎడ్, బీఎడ్, టెట్ పూర్తి చేసి ఉపాధి లేక ఇంట్లో ఉంటూ మనోవేదనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకు ఉన్నత అధికారులు జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓ స్పందించి ఆదివాసీ నిరుద్యోగులచే సీఆర్టీ పోస్టులను భర్తీ చేయాలని లేని పక్షంలో ఐటీడీఏ కార్యాలయం ముందు, ఆందోళన కార్యక్రమం చేపడతామని డిమాండ్ చేశారు. పోస్టుల భర్తీని సైతం ఎలాంటి అవినీతి అక్రమాలకు చోటుచేసుకోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ జిల్లా ఉపాధ్యక్షులు కుమ్ర శ్యాంరావు, ప్రచార కార్యదర్శి వెట్టి మనోజ్, నాయకులు ఆత్రం గణపతి, మడవి శంకర్, ఆదివాసీ విద్యార్థి సంఘం మండల అధ్యక్షులు పుర్క చిత్రు, మండల నాయకులు పెందోర్ కృష్ణ, మెస్రం దినేష్ ఉన్నారు.

దాడులు జరుగకుండా చూడాలి

నవతెలంగాణ-ఉట్నూర్

భీమ్ ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్ రావణ్‌పై దాడి జరిగిందని, దాడులు జరగకుండా ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ అసోసియేషన్ మండల అధ్యక్షులు జగ్జీవన్ అన్నారు. శుక్రవారం స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అసోసియేషన్ మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తర్‌ప్రదేశ్‌లోని దేవ్‌బంద్‌లో భీమ్ ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్ రావణ్‌పై కొన్ని మతోన్మాద శక్తులు కాల్పుల జరిపారని అన్నారు. ఈ దాడిని ఖండిస్తున్నామని అన్నారు. దళిత, బడుగు వర్గాల పక్షాన పోరాడుతున్న ఆయన మీద, కానీ దళితుల మీద కానీ ఇలాంటి సంఘటనలు మళ్లీ జరిగితే ఇక సహించంబోమని, మతోన్మాదులకు తగిన గుణపాఠం చెప్తామని ఆయన హెచ్చరించారు. ఇలాంటి ఘటనలకు పాల్పడిన నిందితులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో అసోసియేషన్ మండల ఉపాధ్యక్షులు కాంబ్లె ప్రజ్ఞశీల్, సొగల ప్రవీణ్, జాయింట్ సెక్రటరీ కొల్లూరి స్వామి, ప్రచార కార్యదర్శి జాడి వెంకటేష్ ఉన్నారు.



కలెక్టర్, తహసీల్దార్‌పై మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు



నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని ప్రజలకు కనీస అవసరాలైన తాగునీరు, రోడ్డు సౌకర్యం కల్పించడంలో విఫలమైన జిల్లా కలెక్టర్, మండల తహసీల్దార్‌పై ఏఐసీసీ రీసెర్చ్ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర కోఆర్డినేటర్ వినోద్ నాయక్ శుక్రవారం హైదరాబాద్‌లో మానవ హక్కుల కమిషన్ కార్యాలయంలో పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలు పొందాల్సిన హక్కులలో భాగంగా మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ తరపున ఎన్ని ధర్నాలు చేసిన పట్టించుకోవడంలేదని తెలిపారు. ఆదివాసీ, గిరిజన గ్రామాలలో నేటికీ కనీస రోడ్డు సౌకర్యాలు లేక, కనీసం అంబులెన్స్ కూడా గ్రామాల్లోకి వెళ్లలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరుగుతున్నా పట్టించుకోకపోవడం చాలా దారుణమని అన్నారు. మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తే, న్యాయం జరుగుతుందనే ఆశతో పిర్యాదు చేశానని పేర్కొన్నారు.

అవకాశం ఇచ్చినా ప్రజలను మోసం చేశాడు : బీజేపీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎమ్మెల్యే జోగు రామన్నకు నియోజక వర్గం ప్రజలు నాలుగు సార్లు అవకాశం ఇచ్చినా, ప్రజలని మోసమే చేశారని బీజేపీ జిల్లా అధ్యక్షులు పాయల శంకర్ అన్నారు. శుక్రవారం మహాజాన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా స్థానిక వికలాంగుల కాలనీ, విద్యానగర్ కాలనీల్లో ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే జోగు రామన్నకు నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా అవకాశం ఇచ్చిన ఆయన తన సొంత ప్రయోజనాలే చూసుకున్నారని అన్నారు. కేంద్రలోని బీజేపీ ప్రభుత్వ హయాంలో నరేంద్రమోదీ నాయకత్వంలో వేలకోట్ల రూపాయలు మంజూరు చేసిందని కానీ రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధులను స్వాహా చేసిందని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఆదినాథ్, జోగు రవి, అంకత్ రమేష్, ఆకుల ప్రవీణ్, సోమ రవి, విజయ్. దినేష్ మటోలియా, చిలుకూరి జ్యోతిరెడ్డి, ధోని జ్యోతి, ముకుంద్, రాము, సంతోష్, శ్రీకాంత్, రాజు కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రభుత్వాస్పత్రిలో రోగులకు నాణ్యమైన వైద్యం అందిస్తున్నాం



నవతెలంగాణ-నార్నూర్

ప్రభుత్వాస్పత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందిస్తున్నామని హెల్త్ సూపర్‌వైజర్‌లు చౌహన్ చరణ్‌దాస్ తెలిపారు. డాక్టర్ డే సందర్భంగా నవతెలంగాణతో మాట్లాడారు. ప్రభుత్వం వైద్యారోగ్య శాఖ ప్రవేశపెట్టిన కంటి వెలుగు, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, లాంటి తదితర సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసేలా అమలు చేస్తున్నామని తెలిపారు. తమకు కేటాయించిన గ్రామాల్లోని రోగులకు గర్భిణీలకు పీహెచ్‌సీలో డాక్టర్ ద్వారా వైద్యం అందిస్తున్నామని పేర్కొన్నారు. గర్భిణీలు వంద శాతం ప్రసవాలు ప్రభుత్వాస్పత్రిలో జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండి పూర్తి స్థాయి వైద్యసేవలు అందించేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

సీఎం సభకు బయలుదేరిన బీఆర్‌ఎస్ శ్రేణులు

నవతెలంగాణ-నార్నూర్

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో శుక్రవారం జరిగిన సీఎం సభకు ఉమ్మడి మండలంలోని బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. జై బీఆర్‌ఎస్ అంటూ నినాదాలు చేశారు. ఎంపీపీ కనక మోతుబాయితో పాటు అన్ని గ్రామాల బీఆర్‌ఎస్ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు బయలుదేరారు.

నవతెలంగాణ
www.navatelangana.com
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
శనివారం 01 జులై 2023

సాయిచందు మృతి తీరని లోటు



జన్నారం :సాయి చందు మృతి తీరని లోటని అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు భరత్ కుమార్ అన్నారు. ఆయన మృతికి సంతాపంగా శుక్రవారం మండల కేంద్రంలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో సంతాప, సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిచంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం రాష్ట్ర నాయకులు బోర్లకుంట ప్రభుదాస్, జిల్లా ఉపాధ్యక్షుడు మామిడిపల్లి ఇంద్రయ్య, దాముఖ కరుణాకర్, దుమల రమేష్, అక్క వత్తుల దేవయ్య, జంగం రవి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముత్యం సతీష్, సులువ జనార్ధన్ వల్లాల నరసగౌడ్, సృజన్, వెంకటేష్, దేవా, ప్రశాంత్ బుచ్చయ్య పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన గజ్జి రామయ్య

- కండువాకప్పి ఆహ్వానించిన సీఎం కేసీఆర్

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని గజ్జిగూడ గ్రామానికి చెందిన కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గజ్జి రామయ్య శుక్రవారం సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఆసిఫాబాద్‌లో నిర్వహించిన ప్రగతి నివేదన సభలో గజ్జి రామయ్యను ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తన క్లాస్ మెట్ అని, సీనియర్ నాయకులని సీఎం కేసీఆర్‌కు పరిచయం చేశారు. కేసీఆర్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గజ్జి రామయ్య 1972 నుంచి క్రియాశీలక రాజకీయాల్లో కొనసాగుతున్నారు. పలుమార్లు సర్పంచ్‌గా, మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. ఐదు దశాబ్దాలుగా కాంగ్రెస్‌లో కొనసాగిన గజ్జి రామయ్య బీఆర్ఎస్‌లో చేరడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

సీపీఐ(ఎం) కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్టు



నవతెలంగాణ-జన్నారం

కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా సమీకృత కలెక్టరేట్ సముదాయా భవనాలను, ప్రారంభించడానికి సీఎం కేసీఆర్ శుక్రవారం వస్తున్న సందర్భంగా మండలంలోని సీపీఐ(ఎం), కాంగ్రెస్ నాయకులను స్థానిక పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కనికరం అశోక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోర్లకుంట ప్రభుదాస్, మాట్లాడుతూ పక్క జిల్లాలో సీఎం వస్తే ఈ జిల్లాలో మమ్ములను అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు అందరికీ ఉందన్నారు. తనను ఎక్కడ ప్రశ్నిస్తామోనని భయపడి పోలీసుల ముందస్తు అరెస్టు చేయించడం అతని అవివేకానికి నిదర్శనం అన్నారు. అరెస్టు అయినవారిలో నాయకులు కే.బుచ్చయ్య, లింగన్న, పసివుల్ల, రమేష్, ఇందయ్యా ఉన్నారు.

నస్పూర్ : ఆసిఫాబాద్ జిల్లాలో సీఎం కేసీఆర్ పర్యటనను అడ్డుకుంటామని భయంతో శ్రీరాంపూర్‌లో బీజేపీ నాయకులు దళిత మోర్చా అధ్యక్షుడు సిరికొండ రాజు, యువ మోర్చా అధ్యక్షుడు కొండా వెంకటేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దాగం శ్రీకాంత్‌ను బెల్లంపల్లిలో ముందస్తు అరెస్టు యడం సరికాదని వారు మండిపడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ భయపడి పిరికిపందలా వ్యవహరించారని విమర్శించారు. అరెస్టు చేయడం ద్వారా పోరాటాన్ని ఆపలేరని, రాబోవు రోజుల్లో అవినీతి ప్రభుత్వాన్ని ప్రజలే ఓడిస్తారని అన్నారు. విద్యారంగ సమస్యలపై అనునిత్యం పోరాటం చేస్తున్నటువంటి నాయకులను అరెస్టు చేయడం సిగ్గుచేటని ఎస్ఎఫ్ఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి అన్నారు.

ప్రతి ఒక్కరికి చట్టాలపై అవగాహన ఉండాలి



నవతెలంగాణ-దండేపల్లి

ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గానికి చెందినవారు తప్పనిసరిగా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మండల తహసీల్దార్ హనుమంతరావు అన్నారు. శుక్రవారం మండలంలోని రెబ్బనపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సివిల్ రైట్స్ డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చట్టాలపై అవగాహన కల్పించామని గ్రామ ప్రజలు పలు అంశాలను తమ దృష్టికి తీసుకురాగా పరిష్కరించామని అన్నారు. ఎవరైనా వివక్షకు గురి చేస్తే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. చట్టాలపై అవగాహన కలిగి ఉంటే సమస్యలను సత్వరమే పరిష్కారం చేసుకోవచ్చని ప్రజలకు సూచించారు. అనంతరం జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ సభ్యులు జిల్లపెల్లి వెంకటేష్, బచ్చల ఆంజన్నలు ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. భారత రాజ్యాంగం ప్రకారం వివక్షకు తావు లేదని ఎవరైనా దళితులపై వివక్ష చూపితే ఊరుకోమని అన్నారు. పలు చట్టాలపై ప్రజలకు వివరించారు. ఎస్సీ కాలనీలో విద్యుత్ తీగలో తమ ఇండ్ల పైకి వస్తున్నాయని వారి దృష్టికి తీసుకురాగా అధికారులు స్పందించి సరి చేసే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మల్లేశం, సర్పంచ్ కందుల కళ్యాణి అశోక్ పాల్గొన్నారు.

దోబీఘూట్ నిర్మించాలని వినతి



నవతెలంగాణ-నస్పూర్

మున్సిపాలిటీ పరిధిలో మోర్డన్ దోపిఘాట్ నిర్మించాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం మంచిర్యాల జిల్లా ఆధ్వర్యంలో నస్పూర్ మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్‌కు శుక్రవారం వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ స్థితిగతుల గురించి మురికి నీటి ద్వారా అనారోగ్యాల పాలు అవుతున్నామని, బట్టలు పిండే క్రమంలో వివిధ రసాయనలకు గురై చేతులు కాళ్ల పనిచేయకుండా అనారోగ్యాలకు గురవుతున్నామని అన్నారు. ఈ విషయం తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని తెలిపారు. దీనిలో భాగంగా మునుగోడు ఉప ఎన్నికల్లో రజక వృత్తిదారుల సంఘం అడిగిన ఒప్పందం ప్రకారం అన్ని మున్సిపాలిటీలలో మోర్డన్ దోబీ ఘాట్లు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చి దానిక ప్రకారం జీఓ విడుదల చేసిందని, జీఓ ప్రకారం మాకు ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తంగళ్ళపల్లి వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి పాయిరాల రాములు, చందర్ రవి, మహేష్ రామస్వామి పాల్గొన్నారు.

సింగరేణి మందమర్రి ఏరియాలో
ముగిసిన స్వచ్ఛత పక్వాడ కార్యక్రమం



నవతెలంగాణ-మందమర్రి

మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో శుక్రవారం స్వచ్ఛత పక్వాడ కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏరియా జనరల్ మేనేజర్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటిస్తే అందరూ ఆరోగ్యంగా ఉంటారని, పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటడమే కాకుండా వాటిని పరిరక్షించే బాధ్యత కూడా తీసుకోవాలని సూచించారు. గనులు కార్యాలయాలు పరిశుభ్రంగా ఉంచుతూ సింగరేణియులు ఇతరులకు ఆదర్శంగా నిలవాలని ఉద్యోగులు వారి గృహాలతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్లాస్టిక్‌ని నిషేధించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. గ్లోబల్ వార్మింగ్‌తో అన్ని దేశాల ప్రజలు సతమతం అవుతున్నారని గుర్తు చేశారు. జూన్ 16వ తేదీ నుండి 30వ తేదీ వరకు అన్ని గనులు డిపార్ట్మెంట్లలో కార్మిక వాడల్లో స్వచ్ఛత పక్వాడ కార్యక్రమాలలో పాల్గొన్న అందరికీ అభినందనలు తెలిపారు. కార్మికులకు విద్యార్థులకు బహుమతులు అందజేసి, సివిల్ డిపార్ట్మెంట్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను సన్మానించారు. స్వచ్ఛత పక్వాడ కార్యక్రమంలో భాగంగా మందమర్రి ఉన్నత పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, క్విజ్, డ్రాయింగ్ పోటీలలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులను అందజేశారు. సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించిన స్వచ్ఛత పక్వాడ కార్యక్రమంలో సేవా సమితి మహిళలు పర్యావరణం పరిశుభ్రత అనే నాటక ప్రదర్శనకి బహుమతులను అందజేశారు. జీఎం కార్యాలయ ఆవరణలో జనరల్ మేనేజర్‌తో పాటుగా ఉద్యోగులు, పాఠశాల విద్యార్థిని విద్యార్థులు, మహిళలతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, టీబీజీకేఎస్ స్ట్రక్చర్ కమిటీ సభ్యులు సీవీ రమణ, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, పర్యావరణ అధికారి ప్రభాకర్ పాల్గొన్నారు.

జన సంద్రం.. బీఆర్ఎస్‌లో ఆనందం..

- సీఎం సభకు పోటెత్తిన జనం
- గులాబిమయమైన ఆసిఫాబాద్ పట్టణం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో సీఎం కేసీఆర్ నిర్వహించిన ప్రగతి నివేదన సభకు నాయకుల అంచనాలకు మించి ప్రజలు హాజరుకావడంతో జిల్లా కేంద్రంలోని రహదారులు జనసంద్రమయ్యాయి. అనేకమంది రోడ్డుకిరువైపుల చెట్ల కింద సేద తీరుతూ కనిపించారు. బీఆర్ఎస్ నాయకుల అంచనాలకు మంచి పెద్దఎత్తు ప్రజలు తరలివచ్చారు. సభకు ముందు నిర్ణయించిన ప్రకారం ఆసిఫాబాద్ నియోజకవర్గం నుండి 30,000, సిర్పూర్ నుంచి 25000 మందిని తరలించడానికి ఏర్పాట్లు చేసారు. అయితే ఆ అంచనా మించి సభా ప్రాంగణానికి జనాలు వచ్చారు. మంది ఎక్కువ కావడంతో సభా ప్రాంగణం సరిపోక ఎక్కడిక్కడ ప్రజలు 2 గంటల పాటు నిలబడి సభ వీక్షించారు.

పోడు పట్టాల పంపిణీయే కారణం..!

ఆదివాసీల చిరకాల కాంక్ష పోడు సాగుదారులకు పట్టాల పంపిణీ ఆసిఫాబాద్ నుంచి ముఖ్యమంత్రి ప్రారంభించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. రాష్ట్రంలో పోడుపట్టాల పంపిణీలో మూడో స్థానంలో జిల్లా ఉండడం లబ్ధిదారులు ఎక్కువగా ఉండడంతో ఆదివాసీలు పెద్దఎత్తున తరలివచ్చారు. మూడు రోజుల ముందు వర్షంతో సభ నిర్వహణపై అనుమానాలు రెకెత్తగా వాటన్నింటిని పటాపంచలు చేస్తూ జనాలు తరలివచ్చారు. ఏది ఏమైనా సభకు పెద్ద ఎత్తున ప్రజలు రావడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఆనందాన్ని నింపింది.



ఆర్కే-న్యూటెక్ గనిపై హరితహారం



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-న్యూటెక్ గనిలో హరితహారం కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్కే-7 గనుల గ్రూపు ఏజెంట్ మాలోత్ రాముడు ముఖ్య అతిథిగా హాజరై ఆర్కే-న్యూటెక్ గని ఎస్ఓఎం ఇ.స్వామిరాజు, ఆర్కే-7 గని మేనేజర్ సాయిప్రసాద్‌తో కలసి మొక్కలు నాటారు. భవిష్యత్తులో మానవ మనుగడ సాధించాలంటే ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని పేర్కొన్నారు. అటవీ ప్రాంతాల్లో పండ్ల మొక్కలు పెంచితే జన సంచారంలో కోతుల బెడద తగ్గుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణలో హరితహారం ప్రారంభించిన తర్వాత సింగరేణి సీఎండీ ఎన్.శ్రీధర్ ఆదేశాల మేరకు కంపెనీ వ్యాప్తంగా పెద్దఎత్తున మొక్కలు నాటుతున్నట్లు గుర్తు చేశారు. ఇందులో ఉద్యోగులందరూ భాగస్వాములై మొక్కలు నాటుతూ ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యత ఉద్యోగులు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రూపు ఇంజినీర్ రాజా రవిచరణ్, ఆర్కే-న్యూటెక్ గని రక్షణాధికారి కొట్టె రమేష్, సంక్షేమాధికారి పాల్ సృజన్, పిట్ కార్యదర్శి ఎం.జంపయ్య, పిట్ ఇంజినీర్ రాజగోపాలచారి, ఇంజినీర్ కృష్ణ, జేఓ స్టాన్లీ జోన్స్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సింగరేణి క్వార్టర్స్‌కు కౌన్సెలింగ్ నిర్వహణ



నవతెలంగాణ-మందమర్రి

మందమర్రి ఏరియా సిఈఆర్ క్లబ్‌లో శుక్రవారం ఉద్యోగులకు సింగరేణి క్వార్టర్స్ కౌన్సిలింగ్‌ని నిర్వహించారు. ఈ కౌన్సిలింగ్‌కు 80 క్వాటర్స్ లిస్ట్ ప్రకటించగా 102 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకోగా సీనియార్టీ ప్రకారం 50 మంది ఉద్యోగులకు క్వార్టర్స్ కేటాయించామని పర్సనల్ మేనేజర్ శ్యామ్ సుందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం రాజేశ్వర్‌రెడ్డి, డీజీఎం (ఐఈడీ) రాజన్న, ఏజెంట్ రాందాస్, సీనియర్ పీఓ ఎండి ఆసిఫ్, పర్సనల్ డిపార్ట్మెంట్ ఒఎస్ రాయలింగు పాల్గొన్నారు.

బదిలీపై వెళుతున్న ఏజెంట్‌కు సన్మానం



నవతెలంగాణ-కాసిపేట

కాసిపేట గ్రూపు ఏజెంట్‌గా నియమితులై నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకుని బదిలీపై ఆర్జీ-3, ఓసీ-2 కు ప్రాజెక్టు అధికారిగా వెళుతున్న సందర్భంగా కాసిపేట-1 గనిపైన ఉద్యోగులు, యూనియన్ నాయకులు, అధికారులు శుక్రవారం ఘనం గా సన్మానించారు. ముందుగా గని మేనేజర్, అధికారులు ఏజెంట్ కుర్మ రాజేందర్‌ను పూల బొకే, శాలువాతో సన్మానించారు. ఏఐటీయూసీ సీనియర్ నాయకుడు చిప్ప నర్సయ్య, బ్రాంచి సెక్రెటరీ దాగం మల్లేష్, పిట్ సెక్రెటరీ మీనుగు లక్ష్మీ నారాయణ, రాజేందర్ సన్మానించారు. టీబీజీకేఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ మెడిపెల్లి సంపత్, కేంద్ర కమిటీ వైస్ ప్రెసిడెంట్ బడికెల సంపత్, కేంద్ర కమిటీ కార్యదర్శి రాజశేఖర్ శాలువా, బొకేతో సన్మానించారు.

సీఎం సభలో నిరసన సెగ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తమకు ఉద్యోగ భద్రత కల్పించాలంటూ ప్రగతి నివేదన సభలో ఐకేపీ వీఓఏలు ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో రకాల సేవలు చేస్తున్న తమను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలంటూ నిరసన వ్యక్తం చేశారు. ఒక దశలో ముఖ్యమంత్రి కల్పించుకొని వారిని వారించాలంటూ ఆదేశించారు.

భగీరథ నీటిని చూపుతూ నిరసన

సభకు వచ్చిన తాము పట్టుకు వచ్చిన భగీరథ మురికి నీరు చూపిస్తూ మహిళలు నిరసన తెలిపారు. ఇంత మురికి నీరు ఎలా తాగాలని ప్రశ్నించారు. పోలీసులు కల్పించుకుని వారిని వారించి వాటర్ బాటిల్స్ తీసుకున్నారు.

కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు

- డాక్టర్ యెగ్గన శ్రీనివాస్



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

మంచిర్యాల జిల్లాలో కార్పొరేట్ స్థాయిలో కీళ్లు, ఎముకల చస్త్ర చికిత్స వైద్య సేవలు అందింస్తున్న ఎయిమ్స్ ఆస్పత్రి డాక్టర్ యెగ్గన శ్రీనివాస్ నేడు డాక్టర్స్ డే పురస్కరించుకుని నవతెలంగాణతో మాట్లాడారు. జిల్లాలోనే అంతర్జాతీయ ప్రమాణాలతో పేద, మధ్య తరగతి వారికి అందుబాటులో వైద్య సేవలు ఎయిమ్స్ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయని అన్నారు. అత్యాధునిక వెంటిలేటర్ పరికరాలతో కీళ్లు, ఎముకలకు శస్త్రచికిత్స చేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు ఆసుపత్రిలో 200 కీళ్ల మార్పిడి చేశానని, 80 ఏండ్లుపై బడిన వారికి కూడా సక్సెసగా కీళ్ల మార్పిడి చేశామని తెలిపారు. డాక్టర్ యెగ్గన శ్రీనివాస్‌కు 2022లో ఉత్తమ వైద్యులుగా, అబ్దుల్ కలాం అవార్డు పొందారు. ప్రజలు మద్యం సేవించి రోడ్లపై బైకులు, కార్లు, నడపకూడదని నెమ్మదిగా వెళుతూ ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే ఎలాంటి ప్రమాదాలబారిన పడకుండా ఉండవచ్చని తెలిపారు. రానున్న సీజనల్ డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాల వ్యాధులను అరికట్టేందుకు ఇంటి పరిసర ప్రాంతాలు పరి శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. అలాగే తోటి డాక్టర్లకు డాక్టర్ డే శుభాకాంక్షలు తెలిపారు.

నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-నస్పూర్

నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న పాఠశాలలపై మండల విద్యాధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు బండి సత్యనారాయణ, ఈదునూరి అభినవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ కృష్ణవేణిహై స్కూల్, న్యూ విజన్ ప్లే స్కూల్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా పాఠ్యపుస్తకాలు, స్టేషనరీ వస్తువులను అమ్ముతున్నారని పేర్కొన్నారు. ఈ విషయంపై పాఠశాల సిబ్బందిని అడగ నిర్లక్ష్య సమాధానం తెలిపారని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా నస్పూర్ మండలంలో ఉన్నటువంటి అన్ని పాఠశాలలు జిల్లా విద్యాధికారి అనుమతులు లేకుండా పాఠ్యపుస్తకాలు స్టేషనరీ వస్తువులను అమ్మరాదని హెచ్చరించారు. జిల్లా విద్యాధికారి స్పందించి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో డీఈఓ కార్యాలయాన్ని ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు గజర్ల విష్ణు, శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా ఉపాధ్యాయుల సర్దుబాటు

- టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల రాజావేణు



నవతెలంగాణ-దండేపల్లి

ఉపాధ్యాయుల సర్దుబాటు నిష్పక్షపాతంగా జరగాలని పని, సర్దుబాటు పేరుతో ఉపాధ్యాయుల డిప్యూటేషన్లను నిబంధనలను ప్రకారం కేటాయించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల రాజవేణు డిమాండ్ చేశారు. పక్షపాతం చూపించకుండా సర్దుబాట్లు జరగాలని కోరుతూ టీఎస్‌యూటీఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల విద్యాధికారి రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కొట్టే చంద్రమౌళి, మండల అధ్యక్ష, కార్యదర్శులు రత్నం తులసిపతి, ఇండ్ల మల్లేష్, పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-దస్తురాబాద్

డెంగ్యూ మలేరియా సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా అప్రమత్తంగా ఉండాలని హెచ్ఈఓ వేణుగోపాల్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జులై 5న భూపాల్‌పల్లిలో కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ మహాసభలు

రెబ్బెన: భూపాలపల్లిలో జులై 5వ తేదీన జరిగే కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ మహాసభలను విజయవంతం చేయాలని గోలేటి బ్రాంచ్ కాంట్రాక్టు వర్కర్స్ గౌరవ అధ్యక్షుడు భయ్య మొగిలి, వర్కింగ్ ప్రెసిడెంట్ రాయిళ్ల నర్సయ్య కోరారు. భూపాలపల్లి జరిగే సింగరేణి వర్కర్స్ యూనియన్ అనుబంధ సంఘ మహాసభలు జరుగుతాయని, సింగరేణి కాంట్రాక్టు వర్కర్లందరు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. మహాసభల్లో కాంట్రాక్టు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు చేయడం జరుగుతుందన్నారు. కాంట్రాక్టు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, కోలిండియా కార్మికుల మాదిరిగా హైపర్ కమిటీ వేతనాలు చెల్లించాలని, కాంట్రాక్టు కార్మికులకు బోనస్, సెలవులు చట్టప్రకారం ఇవ్వాలని, ఓసీలలో వంద శాతం స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, కాంట్రాక్టు కార్మికులకు కార్పొరేట్ వైద్య సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు.

పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- కలెక్టర్ రాహుల్ రాజ్



నవతెలంగాణ-నార్నూర్

గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాభివృద్ధికి చేపట్టిన వివిధ పనులను తనిఖీ చేశారు. మండల కేంద్రంలో నిర్మించిన నర్సరీ, పల్లె ప్రకృతి వనం, వర్మి కంపోస్టును సందర్శించారు. పల్లె ప్రకృతి వనాన్ని చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో పారిశుధ్యం లోపించకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పారిశుధ్య పనులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాభివృద్ధితో పాటు పారిశుధ్య పనులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు ఉంటాయన్నారు. నర్సరీలో నాటిన వివిధ రకాల మొక్కలను చూశారు. హరితహారం కార్యక్రమానికి మొక్కలను సిద్ధం చేయాలని ఆదేశించారు. జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల, ఏకలవ్య గురుకుల పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణలో రోజు సానిటేషన్ చేసి విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని పాఠశాల ప్రిన్సిపల్ ఉపేందర్‌ను ఆదేశించారు. పాఠశాలలో ఉన్న సమస్యలపై ఆరా తీశారు. ఆయన వెంట ఎంపీడీఓ కావల రమేష్, ఎంఈఓ ఆశన్న, డిప్యూటీ తహసీల్దార్ అమృత్‌లాల్, ఏపీఓ సురేందర్, కార్యదర్శి దినేష్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

సీఎం కేసీఆర్ చేతుల మీదుగా అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా కేంద్రంలోని వివిధ భవనాలు, విగ్రహాల ఆవిష్కరణ చేపట్టారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం నూతన కలెక్టరేట్ కార్యాలయానికి హెలికాప్టర్ ద్వారా చేరుకొని అక్కడనుండి కుమురం భీమ్ చౌక్ వద్ద ఏర్పాటు చేసిన భీం కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభించి చిల్డ్రన్ పార్క్ చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షించి మాజీ మంత్రి కొట్నాక భీంరావు విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పించారు. అక్కడి నుండి జిల్లా కేంద్రంలో 25కోట్ల90లక్షల వ్యయంతో నిర్మించిన జిల్లా పోలీస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం నూతన సమీకృత కలెక్టరేట్ భవనం వద్దకు చేరుకుని అన్ని మతాల ప్రార్థనలు నిర్వహించి రూ.52.2కోట్ల వ్యయంతో ఐటిడిఏ భవనాన్ని ప్రారంభించారు. అక్కడ ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో జిల్లాలో 12 మంది పోడు సాగుదారులకు పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విందులో అధికారులు ప్రజాప్రతినిధులు పోడు సాగుదారులతో కలిసి భోజనం చేశారు. అనంతరం బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ, మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్, డిజిపి అంజన్ కుమార్, రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ కమిషనర్ గణపతిరెడ్డి, జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్, ఉట్నూరు ఐటీడీఏ పీఓ వరుణ్‌రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్లు రాజేశం, చాహత్ బాజ్‌పాయి, జిల్లా పరిషత్ చైర్మన్ కోవ లక్ష్మి, శాసనమండలి సభ్యులు దండే విఠల్, సిర్పూర్, ఆసిఫాబాద్, బోథ్, మంచిర్యాల, ఆదిలాబాద్ నియోజకవర్గాల శాసనసభ్యులు కోనేరు కోనప్ప, ఆత్రం సక్కు, రాథోడ్ బాపురావు, నడిపెల్లి దివాకర్‌రావు, జోగు రామన్న పాల్గొన్నారు.

పోడు పట్టాలతో లబ్దిదారుల్లో ఆనందం : మంత్రి ఐకేరెడ్డి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పోడుపట్టాల పంపిణీతో లబ్దిదారుల్లో ఆనందం వెల్లివిరుస్తోందని రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రగతి నివేదన బహిరంగ సభలో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 150000 మందికి నాలుగు లక్షల మూడు వేల ఎకరాల పట్టాల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వంద సంవత్సరాల క్రితం ఆసిఫాబాద్ జిల్లాగా ఉండేదని, రాష్ట్ర సాధన తర్వాత తిరిగి జిల్లా సాధ్యమైందని తెలిపారు. జిల్లాలో వట్టివాగు, అడ, జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టులతో పాటు వార్దా నది ప్రాజెక్టు ద్వారా భూస్థిరీకరణ కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. దీనిపై ముఖ్యమంత్రి వివరించామని తప్పకుండా హామీ ఇస్తారని తెలిపారు.

జిల్లా ఏర్పాటుతో అభివృద్ధి సాకారమైంది : కోవ లక్ష్మి



ముఖ్యమంత్రి సభ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కోవలక్ష్మి మాట్లాడుతూ జల్, జంగల్, జమీన్ కోసం పోరాడిన కుమురం భీం సాక్షిగా జిల్లా ఏర్పాటు జరిగిందని, ఆవిర్భావం తర్వాత ఎంతో అభివృద్ధి జరిగిందని పేర్కొన్నారు. పోడు భూములకు పట్టాలు ఆదివాసుల జీవితకాల ఆంక్ష అని, ముఖ్యమంత్రి ఆలోచన మేరకు నేడు నెరవేరిందన్నారు. కలెక్టరేట్‌లో 12మందికి పట్టాలు పంపిణీ చేసినట్లు తెలిపారు.



సీఎంతో సమస్యల పరిష్కారం సాధ్యమైంది : కోనప్ప

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మాట్లాడుతూ జిల్లాలో ఎన్నో సమస్యలు ముఖ్యమంత్రితో పరిష్కారం అయ్యాయని అన్నారు. కౌటాల మండల కేంద్రం వద్ద వార్దా నదిపై వంతెన నిర్మించి మహారాష్ట్రకు ప్రధాన సౌకర్యం కల్పించాలని కోరారు. సిర్పూర్‌లో ఏర్పాటు చేసిన బుద్ధుని విగ్రహం అభివృద్ధి కోసం ఐదు కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరారు. నియోజకవర్గంలో 18 నోటిఫైడ్ గ్రామాల్లో గిరిజనేతరులకు రైతుబంధు



వచ్చేలా చూడాలన్నారు.

కుమురం భీం పోరాటం ఫలించింది : ఆత్రం సక్కు

భీం ఆశయాలను ఆదివాసుల కలలను నిజం చేసిన ముఖ్యమంత్రికి పాదాభివందనం చేస్తున్నట్లు తెలిపారు. పోడు పట్టాల కోసం అమరుల గిరిజనుల పోరాటానికి ఫలితమే నేడు పంపిణీ అని తెలిపారు. పట్టాల పంపిణీతో పాటు రైతుబంధు ఇచ్చినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గిరిజన ప్రాంత ఆదివాసులకు ఆలవాలమైన జీవో నెంబర్ 3 తిరిగి అమలు చేయాలన్నారు. జిల్లాలో గిరిజనేతరులకు కూడా రైతుబంధు అమలు చేయాలని కోరారు.

ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడమే లక్ష్యంగా ముందుకు

- స్వచ్ఛంద పదవీ విరమణ ఆత్మీయ సమ్మేళనంలో టీజీఓ శ్యాంనాయక్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన తనను జిల్లా ప్రజలు ఎంతగానో ఆదరించారని, వారి రుణం తీర్చుకోకుండా జీవితాన్ని ముగిస్తే సార్థకం చేకూరదని భావించి స్వచ్ఛంద పదవీ విరమణ చేస్తున్నట్లు తెలంగాణ గజిటెడ్ అధికారుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆజ్మీరా శ్యామ్ నాయక్ అన్నారు. జిల్లా రవాణా అధికారి హోదాలో పనిచేస్తున్న ఆయన శుక్రవారం స్వచ్ఛంద పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా గజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని టీఎన్జీవో భవన్‌లో వీడ్కోలు, సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యానారాయణ, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు కృష్ణయాదవ్, ఉపాధ్యక్షుడు ఇంజులారెడ్డి, కేంద్ర కమిటీ సభ్యుడు వెంకటయ్య, నిజామాబాద్ రవాణ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, టీఎన్జీవో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంద అశోక్, నవీన్, వనజారెడ్డి, ఆర్డీవో రమేశ్ రాథోడ్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు హాజరై ఆయనను సత్కరిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఒక సాధారణ నిరుపేద కుటుంబ నేపథ్యంగా వచ్చిన తాను ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని జిల్లా ప్రజల ఆశీస్సులతో ఈ స్థాయిలో నిలవగలిగానని శ్యాంనాయక్ అన్నారు. ఉద్యోగ, అధికార వర్గాల సహకారంతో సంఘ నాయకత్వ బాధ్యత స్థాయికి చేరుకోగలిగానన్నారు. తన ఉన్నతికి తోడ్పాటునందించిన ప్రజలకు సేవ చేయకుండా.. జీవితాన్ని ముగించడం సరికాదని భావించి మరో ఎనిమిదేళ్ల సర్వీసును వదులుకుని స్వచ్ఛంద పదవీ విరమణ పొందుతున్నట్లు పేర్కొంటు భావోద్వేగానికి గురయ్యారు. ప్రత్యేకించి రాజకీయాల్లోకి వచ్చే ఉద్దేశంతో తాను ఈ నిర్ణయం తీసుకోలేదని, అయితే ప్రజా సేవ చేసేందుకు వచ్చే ఎలాంటి అవకాశాన్నైనా వదులుకోనని స్పష్టం చేశారు.

ఉత్తమ పారిశుధ్య కార్మికులకు సన్మానం



నవతెలంగాణ - రెబ్బెన

స్వచ్ఛ పక్కాడ కార్యక్రమం ముగింపు వేడుకలను బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి జీఎం కార్యాలయం ఆవరణలో శుక్రవారం నిర్వహించారు. జీఎం జి దేవేందర్ ఉత్తమ పారిశుధ్య కార్మికులను సన్మానించి బహుమతులను అందజేశారు. స్వచ్ఛతపై, సింగరేణిపై హైస్కూల్ విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ స్వచ్ఛతను 15 రోజులు మాత్రమే కాకుండా 365 రోజులు కొనసాగించాలన్నారు. ప్రతి వ్యక్తి బాధ్యతగా పరిసరాల శుభ్రత కోసం కొంత సమయం కేటాయించాలన్నారు. పరిసరాలు బాగుంటే ఆరోగ్యం బాగుంటుందని తెలిపారు. స్వచ్ఛత పక్వాడ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఉద్యోగులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో టీబీజీకేయస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజ్ శ్రీనివాస్, ఇన్‌చార్జి ఎస్ఓటు జీఎం ఉమాకాంత్, ఏజీఎం తిరుమలరావు, డీజీఎం సివిల్ సతీష్‌బాబు, డీజీఎం ఎఫ్అండ్ఎ రామారావు, డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహారా, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, పర్సనల్ మేనేజర్ ఐ లక్ష్మణ్‌రావు, డీవైపీఎం రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పీఓ జీకె కిరణ్‌కుమార్, అన్నివ విభాగాల అధిపతులు, ఒప్పంద ఉద్యోగులు పాల్గొన్నారు.

వర్షాకాలంలో రోగాలు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వర్షాకాలంలో ప్రారంభమైన నేపథ్యంలో వ్యాధులు ఎక్కువగా తాగే నీరు, ఆహారం, దోమల ద్వారా వ్యాప్తి చెందుతాయి. వాటిని నుంచి వ్యాదులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ సాహిత్యా జవ్వాజి పేర్కొన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా ఆమె నవతెలంగాణతో మాట్లాడారు. వర్షాకాలం వ్యాధులు రాకుండా ముందస్తుగా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. సాధారణంగా జలుబు, దగ్గు నుండి టైఫాయిడ్, డెంగ్యూ, హిపోటిక్స్ వ్యాధి కూడా వీటి ద్వారానే వస్తుంది. ఈ కొలి అనే బ్యాక్టీరియా ఫుడ్ పాయిజన్‌కు కారణమవుతుంది. వర్షాకాలంలో పరిశుభ్రమైన నీరు తాగాలి. కాచి చల్లార్చిన రాగి బిందెలో నిల్వ ఉన్న తాగితే మరింత మేలు. వర్షాకాలంలో బయట ఫాస్ట్‌ఫుడ్ తినకుండా దూరంగా ఉండాలి. వర్షాకాలంలో జీర్ణక్రియ నిమ్మదిస్తుంది. ఫాస్ట్‌ఫుడ్‌తో, అపరిశుభ్రమైన నీరు తాగడంతో హానికరమైన టైఫాయిడ్, హిపోటిక్స్ వ్యాధులు వ్యాపిస్తాయి.

వ్యాధుల నుండి కాపాడుకోవాలంటే..?

ప్రతి రోజు చేతులు పరిశుభ్రంగా కడుక్కోవాలి. కాచి చల్లార్చిన నీటిని తాగాలి. తుమ్మినప్పుడు లేదా దగ్గినప్పుడు చేతి లేదా హ్యాండ్ కర్చీఫ్‌ని అడ్డుగా పెట్టుకోవాలి. జేబులో కర్చీఫ్‌ను వాడాలి. ఎక్కువ ప్రజలు ఉన్న ప్రదేశాల్లో వైరల్ ఇన్ఫెక్షన్ రాకుండా దూరంగా ఉండాలి. దోమలు కుట్టకుండా ఇంట్లో దోమతెరలు వాడాలి. పూర్తిగా మనిషిని కప్పబడి ఉన్న బట్టలను ధరించాలి. చుట్టుపక్కల ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. నీరు నిల్వ ఉండటంతో దోమలు అభివృద్ధి చెందుతాయి వాటి ద్వారానే మనకు వ్యాధులు వ్యాపిస్తాయి. తొట్లేలలో, పాత టైర్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. రోగ నిరోధక శక్తి కోసం పండ్లను తినాలి. జామ, సపోట, నేరేడు పండ్లు వంటి వాటిని తినాలి. కనీసం రోజుకు 8 నుండి 10 గ్లాసెస్ వాటర్ తాగాలి.

డెంగ్యూ వ్యాధి లక్షణాలు...

డెంగ్యూ వ్యాధిని ఒక్కొక్కరు ఒక్కో విధంగా అనుభవిస్తారు. లక్షణాలు కనిపించినప్పుడు, అవి సాధారణంగా సోకిన దోమ ద్వారా కుట్టిన నాలుగు నుండి పది రోజుల తర్వాత ప్రారంభమవుతాయి, ఫ్లూ వంటి ఇతర వ్యాధులతో గందరగోళం చెందుతాయి. డెంగ్యూ జ్వరం 104 డిగ్రీల ఫారెన్‌హీట్ (40సి) అధిక జ్వరానికి దారితీయవచ్చు. డెంగ్యూ వైరస్ బారిన పడిన తర్వాత, లక్షణాలు కనిపించడానికి సాధారణంగా నాలుగు నుండి ఏడు రోజులు పడుతుంది. డెంగ్యూ లక్షణాలు ఒక్కొక్కరికి ఒక్కో విధంగా ఉండవచ్చు. డెంగ్యూ వ్యాధి లక్షణాలు కనిపించినప్పుడు ఎక్కువగా నీటిని తీసుకోవాలి బొప్పాయి పండ్లను తీసుకోవాలి. చిగుళ్ల నుండి రక్తం కారడం, ఒంటి మీద ఎర్ర మచ్చలు, వాంతులు విరోచనలు రావడం ఇలాంటి లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యున్ని సంప్రదించాలి.

సర్కారు ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు

- డాక్టర్ దేగావత్ శ్రీకాంత్, మెడికల్ ఆఫీసర్, పీహెచ్‌సీ ఇంద్రవెల్లి



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

సర్కారు ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దేగావత్ శ్రీకాంత్ అన్నారు. గత ఐదు సంవత్సరాలుగా ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై డాక్టర్స్ డే సందర్భంగా నవతెలంగాణతో మాట్లాడారు. సీజనల్ వ్యాధులు ఎక్కువగా జూలై నుంచి సెప్టెంబర్ వరకు వ్యాప్తి చెందుతాయి. దీని నివారణకు ఏఎన్ఎంలు, హెచ్ఏ, ఆశావర్కర్ల ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ర్యాపిడ్ ఫీవర్ సర్వేను నిర్వహిస్తాం. జ్వర బాధితులను గుర్తించి వైద్యం అందించడం జరుగుతుంది. హైరిస్క్ గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తాం. గత మే నెల ప్రతి రోజు 100 నుంచి 150 వరకు ఓపీల సంఖ్య నమోదు అయ్యేది. జూన్ నెల వచ్చే సరికి ఆ సంఖ్య ఈ వారం రోజుల నుంచి క్రమం క్రమంగా అధికమౌతోంది. వర్షాలు కాస్త ఆలస్యం కావడం వల్ల రోగుల సంఖ్య అంతంత మాత్రంగానే ఉంది. ప్రస్తుతం పీహెచ్‌సీలో రౌండ్ ది క్లాక్ సేవలు అందుబాటులో ఉన్నాయి. గర్భిణీలకు ప్రెగ్నెన్సీ అయిన మొదటి నెల నుంచి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఆశావర్కర్ల ఆధ్వర్యంలో పీహెచ్‌సీకి వచ్చే వారికి నెలనెలా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నాం. గర్భిణులకు నెలకొకసారి స్కానింగ్ పరీక్షలు సైతం నిర్వహిస్తున్నాం. అవసరమైన వారికి జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించి ఏర్పాట్లు చేస్తున్నాం. అందుకే ప్రతి నెల స్థానిక పీహెచ్‌సీలో 20 నుంచి 30 సుఖ ప్రసవాలు జరుగుతున్నాయి. పీహెచ్‌సీలో ప్రసూతి అయిన రెండవ కాన్పులోపు మహిళకు కేసీఆర్ కిట్‌తో పాటు ఆడపిల్లకు రూ.13 వేలు, మగ బిడ్డకు రూ.11వేలు ప్రభుత్వం నుంచి పారితోషికం వారి వ్యక్తిగత ఖాతాలోనే జమా చేస్తున్నాం. ఆదివాసీ మహిళలకు రెండు కన్న ఎక్కువ కాన్పులకు వచ్చిన వారికి కేసీఆర్ కిట్ అందజేస్తున్నాం. ఏజన్సీలో ముఖ్యంగా మహిళలకు రక్త హీనతతో పాటు పోషకాహార లోపం ఉంటుంది. గర్భవతి మహిళలకు నెల నెల రక్త పరీక్షలు నిర్వహించి, ఐరన్ మాత్రలను పంపిణీ చేస్తున్నాం. పోషకాహార లోపం ఉన్న వారికి అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న గుడ్డు, పాలతో పాటు పౌష్టికాహారాన్ని తీసుకునేలా ఆశా, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఆహారాన్ని అందిస్తున్నాం. స్థానిక పీహెచ్‌సీలో ఒక కమ్యూనిటీ ఆరోగ్య అధికారి పోస్టు ఖాళీగా ఉంది. ఇంత వరకు మందుల కొరత లేదు.

హామీలను విస్మరించిన బీఆర్ఎస్ ప్రభుత్వం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిన బీఆర్ఎస్‌కు రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి అన్నారు. శుక్రవారం గత నెల రోజులుగా కొనసాగుతున్న మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమం చివరిరోజు పట్టణంలోని జైజవాన్‌నగర్, నీరటివాడలోని కాలనీల్లో ఆమె పాల్గొని మోడీ తొమ్మిదేండ్ల ప్రజా సంక్షేమ పాలన గురించి వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో విఫలమైందని అన్నారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో కేవలం సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే జోగు రామన్న కుటుంబాలే బాగుపడ్డాయని అన్నారు. కేవలం చౌక్‌లలో పనులు చేసి అదే అభివృద్ధి అని చెప్పుకునే ఎమ్మెల్యేకు పట్టణంలో వెనుకబడిన కాలనీ సమస్యలు కనబడటం లేదా అని ప్రశ్నించారు. నరేంద్ర మోడీ 9 ఏండ్ల పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండల కేంద్రంలో శుక్రవారం ఫ్రై డే డ్రై డే కార్యక్రమంలో భాగంగా ఏఎన్ఎం సుగుణ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ నిల్వ నీటిని తొలగిస్తూ అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. నీరు నిల్వ ఉండటం వల్ల జరిగే అనర్థాల గురించి వివరించారు. డెంగ్యూ దోమలు నివారణ గురించి తెలిపారు. పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కుమురం భీం విగ్రహా ఆవిష్కరణ విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలోని కుమురం భీం చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన కుమురం భీం విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమానికి ఆదివాసులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఆదిలాబాద్ రూరల్ వైస్ ఎంపీపీ జంగు పటేల్ అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం బీఆర్ఎస్ ఆదివాసీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జులై 10న సాయంత్రం 4 గంటలకు కుమురం భీం విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్న నేపథ్యంలో ఆదివాసీ పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే జోగు రామన్న చేతుల మీదుగా భీం నూతన కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో ఆదివాసీ సంఘాల నాయకులు కినక సురేష్, మర్సకోల బాపూరావు, వసంత్ రావు, మోతి రాం, లక్ష్మణ్, కమ్ము పటేల్ పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులను ఖండించిన టీడీపీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సీఎం కేసీఆర్ ఆసిఫాబాద్ జిల్లా పర్యటన సందర్భంగా టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు గుళ్లపల్లి ఆనంద్‌ను ముందస్తుగా హౌస్ అరెస్టు చేయడాన్ని టీడీపీ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి అల్లూరి రాజారెడ్డి తీవ్రంగా ఖండిస్తున్నట్టు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై సీఎంని నిలదీస్తారని ప్రతిపక్ష నాయకులను అరెస్ట్ చేయడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. అక్రమ అరెస్టులతో ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే అరెస్టు చేసిన నాయకులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రతి ఇంటికి వివరించాలి

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండల కేంద్రంలో శుక్రవారం బీజేపీ ఇంటింటికి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ జద్చర్ల నియోజకవర్గ విస్తరక్ వెంకట్ బైరామోని హాజరయ్యారు. మండల అధ్యక్షులు పొలాస గోవర్ధన్ ఆధ్వర్యంలో శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌లు, బూత్ కమిటీలను నియమించారు. మండల అధ్యకుడు పొలాస గోవర్ధన్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో బీజేపీ జెండా నిర్మల్ నియోజక వర్గంలో ఎగురవేయాలని గెలుపే లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. కేంద్ర పథకాలను ఇంటింటికి చేరే విధంగా ప్రతి రోజు భూత్ స్థాయిలో పని చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ఇన్‌చార్జ్ కమల్ నయన్, సర్పంచ్ సురకంటి ముత్యం రెడ్డి, మండల ఉపాధ్యక్షులు గుడ్ల రంజిత్, ప్రధాన కార్యదర్శి అల్లూరి రాజు, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు రపని గంగాధర్, సీనియర్ నాయకులు గండ్ల చిన్నయ్య, ఏలేశ్వరం గంగాధర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ మైనారిటీ పట్టణ అధ్యక్షుడిగా సయ్యద్ అఫ్జల్

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణానికి చెందిన సయ్యద్ అఫ్జల్‌ను కాంగ్రెస్ పార్టీ మైనార్టీ పట్టణ అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్సీ ఎఐసీసీ మెంబర్ కొక్కిరాల ప్రేమ్ సాగర్‌రావు శుక్రవారం నియమించారు. గత కొంతకాలంగా కాంగ్రెస్ పార్టీకి చేస్తున్న సేవలను గుర్తించిన జిల్లా అధిష్టానం జిల్లా మైనారిటీ అధ్యక్షుడు ఎండీ ఖలీద్ సమక్షంలో నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సయ్యద్ అఫ్జల్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో బాధ్యత ఇచ్చిన అధిష్టానానికి, పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి, పీసీసీ మెంబర్ నూకల రమేష్, పట్టణ అధ్యక్షుడు పల్లె రాజుకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపుకై తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

సింగరేణి గెస్ట్ హౌస్ ఆవరణలో మద్యం బాటిల్

నవతెలంగాణ-నస్పూర్



సింగరేణి గెస్ట్ హౌస్ ఆవరణలో శుక్రవారం మద్యం బాటిల్ ఉండడాన్ని శుక్రవారం నవతెలంగాణ క్లిక్ అనిపించింది. నిత్యం మంత్రులు, ఉన్నత అధికారులు, ప్రజా ప్రతినిధులు సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ ఉంటారు. మరికొంతమంది ఇక్కడ బస చేస్తుంటారు. అందులో భాగంగానే శుక్రవారం తెలంగాణ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి, మల్టీజోన్-2 ఇన్స్‌పెక్టర్ జనరల్ షహ్నావాజ్ ఖాసీం, రామగుండం కమిషనర్ రెమ రాజేశ్వరి ఆసిఫాబాద్ ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా సింగరేణి గెస్ట్ హౌస్‌కి చేరుకున్నారు. ప్రముఖులు పర్యటిస్తున్న ఏరియాలో ఇలాంటి ఘటన చోటు చేసుకోవడం సింగరేణి అధికారుల నిర్లక్ష్యం కనబడుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ గెస్ట్ హౌస్ సింగరేణి అధికారుల పర్యవేక్షణలో ఉంటుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిసారించి ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పలువురు కోరారు.